thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

**టైటిల్ ఫేవరేట్ గా భారత్**



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 154 | జగిత్యాల మంగళవారం 08 సెప్టెంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## ఫేక్ వీడియో అని తెలియదు

- వివాదంపై అభిజిత్ దీప్కే వివరణ
- రామజన్మభూమి ట్రస్ట్ సీఈవో పేరుతో వీడియో షేర్
- తప్పుదోవ పట్టించే పోస్టంటూ నెటిజన్ల విమర్శలు
- వ్యక్తిగత జీవితంపై అభ్యంతరం లేదన్న దీప్కే



.. వివరాలు 4లో

## దేశ ప్రగతికి మహిళలే మార్గదర్శకులు

- భారత చరిత్రలో వారి పాత్ర కీలకం
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా
- స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు చెరగని ముద్ర
- అన్ని రంగాల్లో మహిళల అద్భుత విజయాలు

4



## గ్యాస్ వినియోగదారులకు శుభవార్త

- గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే రీఫిల్ బుకింగ్
- పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నియమం
- రీఫిల్ బుకింగ్ నిబంధనల్లో మార్పులు
- కేంద్రం నుంచి కీలక ఉత్తర్వులు

4





# కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

తెలంగాణలో దాదాపు కోటి ఓట్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ 'సర్' ప్రక్రియను అడ్డుపెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేసే వర్గాలను గుర్తించి వారి ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడు చూసుకుందామనే నిర్లక్ష్యం వద్దని.. భవిష్యత్ ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించే కీలక అంశంగా 'సర్' మారనుందని హెచ్చరించారు.

- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు గల్లంతు
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర
- దీనిపై లౌకిక శక్తులు ఏకం కావాలి
- సర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (చురకలు):** తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత

మిగతా 2 లో

## స్పీకర్‌పై వ్యాఖ్యలతో సభలో
# దుమారం



- తాతా మధును బర్తరఫ్ చేయాలి: ఏలేటి
- కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- 'స్పీకర్‌ను ఉద్దేశించి అనలేదు' అన్న తాతా మధు
- అపార్థమైతే మాటలు వెనక్కి తీసుకుంటానని వివరణ
- 22-ఏ భూములపైనా బీజేపీ నిలదీత

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (చురకలు):** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లుగా భావిస్తున్న వ్యాఖ్యలు సోమవారం సభలో తీవ్ర దుమారం రేపాయి. తాతా మధుపై చర్యలు తీసుకోవాలని అధికారపక్షంతో పాటు బీజేపీ డిమాండ్ చేయగా.. తన వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కావని తాతా మధు వివరణ ఇచ్చారు. తన మాటలు స్పీకర్‌ను ఉద్దేశించినట్లుగా భావిస్తే వాటిని ఉపసంహరించుకుంటున్నానని, విచారం వ్యక్తం చేస్తున్నానని ప్రకటించారు. సభలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌పై అనుచిత భాషను ఉపయోగించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. బీజేపీ

మిగతా 2 లో

## మరోసారి 'సర్' గడువు పొడిగింపు



2

- అక్టోబర్ 7 వరకు పొడిగిస్తూ ఈసీ నిర్ణయం
- నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

## ఉద్యోగాల పేరుతో యూట్యూబర్ మోసం

శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్ట్

2

యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు.



## ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు

- నిషేధిత భూములు 22ఏ జాబితాపై సభలో రగడ
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో బీజేపీ నినాదాలు
- 22ఏ అంశంపై చర్చకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాం
- సభ సజావుగా సాగేందుకు సహకరించాలి

22ఏ జాబితాపై మంత్రి శ్రీధర్ బాబు వివరణ

వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి

అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2





2

## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను
# అడ్డుకోవద్దు

- తెలంగాణ రాష్ట్ర హైకోర్టు పోలీసులకు ఆదేశం
- ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారు
- రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ

# అసెంబ్లీ గేటు వద్ద హైటెన్షన్

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అడ్డగింత
- కేటీఆర్, హరీశ్, జగదీశ్‌రెడ్డికి గాయాలంటూ ఆరోపణ
- మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా వ్యవహరించారని ఆగ్రహం
- పలువురు ప్రజాప్రతినిధుల అరెస్టు
- రాష్ట్రవ్యాప్త నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు

2





## ముగిసిన బీఏసీ సమావేశాలు

3

- ఈనెల 12 వరకు అసెంబ్లీ

## నా వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కావు

శాసనసభ ఘటనపై తాతా మధు వివరణ

3



# మరోసారి 'సర్' గడువు పొడిగింపు

## అక్టోబర్ 7 వరకు పొడిగిస్తూ ఈసీ నిర్ణయం

## నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (చురకలు):** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

# ఉద్యోగాల పేరుతో యూట్యూబర్ మోసం

## శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్ట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (చురకలు):** ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

## తెలంగాణ రాష్ట్ర హైకోర్టు పోలీసులకు ఆదేశం

## ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారు

## రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (చురకలు):** తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



# కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

మొదటి పేజీ తరువాయి

సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్‌ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.




తెలంగాణలో సర్? ప్రక్రియ మొదలవ్వకముందు ప్రధాన ప్రతిపక్షం మాట్లాడింది. కోటి ఓట్లు తొలగించిన తర్వాత సర్?కు వ్యతిరేకంగా వారు ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు. బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నప్పుడు ప్రధాన ప్రతిపక్షం ఆ అంశాన్ని లేవనెత్తడం లేదు. 2029లో జరగబోవు ఎన్నికల్లో నరేంద్రమోదీ ఓటమికి ఈ ఓట్లతోనే పునాది పడుతుంది. ఈ ఓట్లు తొలగిస్తే మోదీకి వెయ్యేనుగుల బలం చేకూరుతుంది. ఎన్నికలు ఎప్పుడో ఉన్నాయి అప్పుడు చూద్దామనుకోవద్దు. గెలుపోటములను నిర్ణయించేంది ఎస్?ఐఆర్ అని అన్నారు. వ్యవసాయం గురించి సాధికారంగా మాట్లాడగలిగిన వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భూమిలోని సారం నుంచి మొదలుపెట్టి నీరు, విత్తనం, పెట్టుబడి, పంట, గిట్టుబాటు ధర.. అన్ని అంశాలు కూలంకషంగా చెప్పేవారని గుర్తుచేశారు. వ్యవసాయం గురించి అవగాహన కోసం సారంపల్లి మల్లారెడ్డి రాసిన పుస్తకాలు చదివానని తెలిపారు. సారంపల్లి మల్లారెడ్డిని తక్కువసార్లే కలిసినప్పటికీ, ఆయన అంటే అపారమైన గౌరవం ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కమ్యూనిస్టుల పోరాటాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడ్డాయని చెప్పారు.దున్నేవాడితే భూమి అంటూ ఎన్నో రైతు సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడారని రేవంత్ రెడ్డి కొనియాడారు. కమ్యూనిస్టులు అంటే తనకు పరోక్షంగా చాలా అభిమానమని వివరించారు. అసైన్డ్?, పోడు పట్టాలు దక్కాయంటే పోరాటం కమ్యూనిస్టులది, పరిష్కారం కాంగ్రెస్?దని వివరించారు. వారి ఉద్యమాల ఫలితంగానే కాంగ్రెస్ అనేక చట్టాలు తెచ్చిందని గుర్తుచేశారు.

# స్పీకర్‌పై వ్యాఖ్యలతో సభలో దుమారం

మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యేల తరఫున ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ దీనిపై సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు కావాలనే ఆ వ్యాఖ్యలు చేశారా? లేక ఎవరైనా ఆయనతో మాట్లాడించారా? అని ఏలేటి ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత గౌరవం కలిగిన స్పీకర్ పదవిని అవమానించేలా వ్యవహరించినట్లు తేలితే తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని, పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఈ వ్యవహారంపై సభలో తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై చేసినట్లుగా చెబుతున్న వ్యాఖ్యల విషయంలో కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు వ్యవహారంపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ పరిణామాల సందర్భంగా మంత్రి సీతక్క భావోద్వేగానికి గురయ్యారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా తీవ్ర మనస్తాపానికి గురై భావోద్వేగంతో స్పందించడంతో సభలో పరిస్థితి మరింత ఉద్విగ్నంగా మారింది.



## 'నా మాటలు స్పీకర్‌ను ఉద్దేశించినవి కావు'

ఈ వివాదంపై అనంతరం తాతా మధు వివరణ ఇచ్చారు. శాసనసభలోకి వెళ్లే సమయంలో తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యంగా మహిళా శాసనసభ్యులకు పోలీసులతో తోపులాట జరిగిందని చెప్పారు. ఆ సమయంలో తనపైనా దాడి జరిగిందని, తన షర్టు, ఫ్యాంటు లాగేందుకు, గొంతు నొక్కేందుకు ప్రయత్నించినట్లు తనకు అనిపించిందని పేర్కొన్నారు. ఆ పరిణామాలతో ఆవేదనకు గురై.. తనపై దాడి చేసింది ఎవరు? తన దుస్తులు లాగేందుకు ఎవరు ప్రయత్నించారు? అలా చేయాలని ఎవరు ఆదేశించారు? అనే ఉద్దేశంతోనే తాను మాట్లాడినట్లు వివరించారు. ఆ వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కాదని స్పష్టం చేశారు. స్పీకర్ వ్యవస్థపైనా, వ్యక్తిగతంగా గడ్డం ప్రసాద్‌పైనా తనకు ఎంతో గౌరవం ఉందన్నారు. "నా వ్యాఖ్యల్లో ఏవైనా స్పీకర్‌ను ఉద్దేశించినట్లుగా భావిస్తే వాటిని ఉపసంహరించుకుంటున్నా. అందుకు విచారం వ్యక్తం చేస్తున్నా" అని పేర్కొన్నారు.

## పోలీసుల తీరుపైనా మధు అభ్యంతరం

శాసనసభలోకి వెళ్లే సమయంలో మహిళా శాసనసభ్యులతో పోలీసులు వ్యవహరించిన తీరుపై చర్యలు తీసుకోవాలని తాతా మధు కోరారు. తమ సీనియర్ నేతలను పోలీసులు అక్కడి నుంచి తీసుకెళ్లారని పేర్కొన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులతో వ్యవహరించే సమయంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి, హోంశాఖ బాధ్యతలు చూస్తున్న రేవంత్‌రెడ్డి స్పందించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## 22-ఏ భూములపైనా సభలో వేడి

మరోవైపు 22-ఏ నిషిద్ధ భూముల వ్యవహారంపై ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ భూముల విషయంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ.. వాటికి బాధ్యత వహించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారులపై నెపం మోపి తప్పించుకునే ప్రయత్నం చేయవద్దన్నారు. 22-ఏ భూముల వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు సభలో స్పష్టమైన హామీ ఇస్తే తమ నిరసన విరమిస్తామని ఏలేటి ప్రకటించారు. దీనిపై ప్రభుత్వం నేరుగా సమాధానం చెప్పకుండా ఇతర అంశాలతో దృష్టి మళ్లిస్తోందని ఆరోపించారు. 'ధరణి' వ్యవహారంపై ఫోరెన్సిక్ ఆడిట్ జరిగిందా? లేదా? అన్నది ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆడిట్ జరిగి ఉంటే సంబంధిత నివేదికలను బహిరంగపరిచి ప్రజల ముందుంచాలని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కోరారు. స్పీకర్‌పై వ్యాఖ్యల వివాదానికి తాతా మధు వివరణ ఇవ్వడంతో వ్యవహారం కొత్త మలుపు తిరగగా.. అధికార, ప్రతిపక్షాల పరస్పర ఆరోపణలతో అసెంబ్లీ సమావేశాలు మరింత వేడెక్కాయి.

# అసెంబ్లీ గేటు వద్ద హైటెన్షన్

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అడ్డగింత

## కేటీఆర్, హరీశ్, జగదీశ్‌రెడ్డికి గాయాలంటూ ఆరోపణ

## మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా వ్యవహరించారని ఆగ్రహం

## పలువురు ప్రజాప్రతినిధుల అరెస్టు

## రాష్ట్రవ్యాప్త నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (చురకలు):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే ప్రాంగణం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో వైఫల్యాలను నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి సహా పలువురు నేతలు గాయపడినట్లు బీఆర్ఎస్ పేర్కొంది. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆ పార్టీ.. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని శ్రేణులకు పిలుపునిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీకి చేరుకున్నారు. అయితే వారిని పోలీసులు గేటు వద్ద అడ్డుకోవడంతో వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నట్లు పార్టీ తెలిపింది. తమ ప్రజాప్రతినిధులను అసెంబ్లీలోకి వెళ్లనీయకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన తోపులాటలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కిందపడటంతో కాలికి గాయమైనట్లు బీఆర్ఎస్ తెలిపింది. కేటీఆర్ చేతికి, నుదిటికి గాయాలయ్యాయని పేర్కొంది. హరీశ్‌రావు కిందపడిన సమయంలో ఆయన చేతిపై పోలీసులు కాలు పెట్టారని పార్టీ ఆరోపించింది. నల్ల



టీషర్టుతో అసెంబ్లీలోకి అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ హరీశ్‌రావు టీషర్టు విప్పి బనియన్‌తో నిరసన కొనసాగించారు. అనంతరం పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. వేముల ప్రశాంత్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అదుపులోకి తీసుకుని తెలంగాణ భవన్‌కు తరలించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు దురుసుగా వ్యవహరించారని బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేసింది. అసెంబ్లీలోకి వెళ్తున్న సునీతా లక్ష్మారెడ్డిని అడ్డుకునే క్రమంలో ఆమె చీరను లాగారని పార్టీ పేర్కొంది. ఈ ఘటనతో ఆమె తీవ్ర ఆవేదనకు గురై కన్నీళ్లు పెట్టుకున్నట్లు తెలిపింది. సబితా ఇంద్రారెడ్డిని అదుపులోకి తీసుకునే సమయంలోనూ పోలీసులు దురుసుగా వ్యవహరించారని, జుట్టు పట్టుకుని వాహనం వైపు తీసుకెళ్లారని బీఆర్ఎస్ ఆరోపించింది. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై చర్యలు తీసుకోవాలని పార్టీ డిమాండ్ చేసింది. అసెంబ్లీకి వెళ్తున్న తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకోవడం, అరెస్టు చేయడం, మహిళా ప్రజాప్రతినిధులతో దురుసుగా వ్యవహరించారంటూ బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎక్కడికక్కడ ఆందోళనలు చేపట్టి అసెంబ్లీ గేటు వద్ద జరిగిన పరిణామాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించింది. ప్రజాప్రతినిధులను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యంపై దాడేనని బీఆర్ఎస్ ఆరోపిస్తూ.. ఈ వ్యవహారాన్ని రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మార్చేందుకు సిద్ధమవుతోంది.

# ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు

**నిషేధిత భూములు 22ఏ జాబితాపై సభలో రగడ**

**ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో బీజేపీ నినాదాలు**

**22ఏ అంశంపై చర్చకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాం**

**సభ సజావుగా సాగేందుకు సహకరించాలి**

**22ఏ జాబితాపై మంత్రి శ్రీధర్ బాబు వివరణ**

**వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి**

**అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (చురకలు):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వెంటనే నిషేధిత భూములు 22ఏ జాబితా వ్యవహారంపై సభలో రగడ మొదలైంది. 22ఏ నిషేధిత భూముల నిబంధన కింద ప్రైవేట్ భూముల నమోదుపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో నినాదాలు చేశారు. ఈ వివాదంపై తక్షణమే విచారణ కమిటీని వేయాలని బీజేపీ సభ్యులు ప్రభుత్వాన్ని పట్టుబట్టారు. ఈ ఆందోళనపై శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందించారు. 22ఏ అంశంపై సభలో స్వల్పకాలిక చర్చ చేపట్టేందుకు తమ ప్రభుత్వం సంపూర్ణ సిద్ధంగా ఉందన్నారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఈ అంశానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని, నిబంధనలకు అనుగుణంగా చర్చపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం సభను అడ్డుకోవడం సరికాదని, సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు సర్దిచెప్పినప్పటికీ బీజేపీ ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గకుండా పోడియం వద్ద కాసేపు నినాదాలు చేశారు. విచారణకు నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటన చేసేవరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేయడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దాంతో తెలంగాణ అసెంబ్లీ 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. ఆ తరువాత సభ ప్రారంభం కాగా, బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని బయట వాళ్లు, లోపల వీళ్లు ఆందోళనకు దిగుతున్నారంటూ కాంగ్రెస్ సభ్యులు వ్యాఖ్యానించారు. సభలో ప్రజా సమస్యల పరిష్కారానికి, అర్థవంతమైన చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై సభా సమయాన్ని వృధా చేస్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎస్సీల అభివృద్ధితో పాటు ఫీజు రీయింబర్స్మెంట్, క్రీడల అభివృద్ధి వంటి కీలక అంశాలపై ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నా... వాటిని వదిలేసి బురదజల్లే రాజకీయం చేయడం ప్రతిపక్షాలకు తగదని సూచించారు. రాష్ట్రంలో కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లక్ష కోట్ల కుంభకోణంపై విచారణ కోరుతూ తెలంగాణ ప్రభుత్వం ఏడాది క్రితమే కేంద్రానికి లేఖ రాసినా... ఆ ఎంక్వయిరీని ఎందుకు తొక్కిపెడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యేల్ని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో విచారణను ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ఎందుకు ఆపుతున్నారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ 22ఏపై స్వల్ప కాలిక చర్చ పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని, 22 ఏ అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బీజేపీ సభ్యులు కూర్చోవాలన్న స్పీకర్?, సభ సజావుగా సాగేందుకు సహకరించాలని ఆ పార్టీ సభ్యులను కోరారు. బీఏసీలో నిర్ణయం తీసుకుని 22ఏపై చర్చిద్దామని తెలిపారు. బీఏసీ సమావేశంలో 22 ఏ అంశాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 22 ఏపై స్వల్ప కాలిక చర్చకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమని హామీ ఇచ్చారు. నియమ నిబంధనలకు అనుగణంగా బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని బీజేపీ ఎమ్మెల్యేలకు చెప్పారు. ప్రతిపక్షాలు చర్చకు సహకరించాలని కోరారు. మంత్రి శ్రీధర్ బాబు, స్పీకర్ సర్దిచెప్పినా బీజేపీ ఎమ్మెల్యేలు వినకుండా 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. రాజకీయాల కోసం సభను అడ్డుకోవడం సరైంది కాదని శ్రీధర్ బాబు విమర్శించారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలను కోరారు. అయితే శ్రీధర్ బాబు విజ్ఞప్తిని బీజేపీ సభ్యులు పట్టించుకోలేదు. పదేపదే ఆయన కోరినా 22ఏ పై తక్షణమే చర్చ జరిగాలని పట్టుపట్టారు. దీంతో సభలో గందరగోళం చెలరేగింది. ఓ దశలో స్పీకర్ సభను వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తరువాత కూడా బీజేపీ సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. వచ్చే బోనాల పండుగ నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేస్తామని శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు నియోజకవర్గాన్ని యూనిట్?గా తీసుకున్నట్లుగా వివరించారు. లబ్ధిదారులకు మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకే సిమెంట్ ఇప్పిస్తామని చెప్పారు. పేదలు నివసించే ప్రాంతంలోనే ఇందిరమ్మ ఇళ్లను కట్టించి ఇస్తామని పొంగులేటి వెల్లడించారు. 2023 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్? ప్రభుత్వం హడావిడిగా కొంతమందికి పట్టాలిచ్చిందన్నారు. వారు ఇచ్చిన ఇళ్లలో చాలా మంది నివసించట్లేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పేదలు నివసించే ప్రాంతానికి 30-40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు ఇచ్చారని, డబుల్? బెడ్రూమ్ ఇళ్లలో నివసించే వారిని అంటరాని వారిగా చూసేవారని ఆయన తెలిపారు.

# ‘సీఎం రేవంత్ సారీ చెప్పాల్సిందే’

**ఇది శాసనసభ కాదు.. దుశ్శాసన సభ: కేటీఆర్**

**మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేశారంటూ ఫైర్**

**టీషర్టులతో పార్లమెంట్‌కు వెళ్లొచ్చు.. అసెంబ్లీకి రాకూడదా?: హరీశ్**

**ఘటన వెనుక సీఎం కుట్ర ఉందన్న కేటీఆర్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (చురకలు):** అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పోలీసుల మధ్య జరిగిన తోపులాట రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు వ్యవహరించిన తీరుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. “రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ టీషర్టులతో పార్లమెంట్‌కు వెళ్లొచ్చు.. మేం టీషర్టులతో అసెంబ్లీకి రాకూడదా?” అని ప్రశ్నించారు. మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరింత తీవ్రంగా స్పందిస్తూ.. “ఇది ముమ్మాటికీ దుశ్శాసన సభ” అని వ్యాఖ్యానించారు. మహిళా ప్రజాప్రతినిధులతో పోలీసులు దురుసుగా వ్యవహరించారని, ఈ ఘటన వెనుక సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలను నిరసిస్తూ నినాదాలతో కూడిన నల్ల టీషర్టులు ధరించి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి వచ్చారు. అయితే ప్రధాన గేటు వద్ద పోలీసులు వారిని అడ్డుకోవడంతో వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. పోలీసుల అభ్యంతరంతో హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు టీషర్టులు విప్పి బనియన్లతోనే నిరసన కొనసాగించారు. అనంతరం హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. అసెంబ్లీ చరిత్రలో ఈ రోజు అత్యంత నల్లని రోజుగా మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు. తమ టీషర్టులపై ప్రభుత్వ హామీలను అమలు చేయాలనే నినాదాలే ఉన్నాయని చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కు తమకు ఉందన్నారు. “రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ నల్ల టీషర్టులు ధరించి పార్లమెంట్‌కు వెళ్లారు. అదే తరహాలో మేం అసెంబ్లీకి వస్తే ఎందుకు అడ్డుకున్నారు? ప్రధాన ప్రతిపక్షం సభలో ఉంటే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుందనే భయంతోనే మమ్మల్ని బయట ఉంచారు” అని హరీశ్‌రావు ఆరోపించారు.

**‘మహిళా ఎమ్మెల్యేలపై ఇదేం తీరు?’**

సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారని, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కారని హరీశ్‌రావు ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధులతో దురుసుగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన అధికారులను ఎక్కడున్నా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. తోపులాటలో జగదీశ్‌రెడ్డిని కిందపడేశారని, కేటీఆర్, సంజయ్, యాదవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డికి గాయాలయ్యాయని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు, పింఛన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై సభలో నిలదీస్తామనే భయంతోనే తమను అడ్డుకున్నారని ఆరోపించారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు ఉక్కుపాదం మోపారని మండిపడ్డారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీల అమలును ప్రశ్నిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే తమపై పోలీసులను ప్రయోగించారని ఆరోపించారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి వంటి సీనియర్ మహిళా నేతలతో పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణమన్నారు. మహిళా సాధికారత గురించి కాంగ్రెస్ జాతీయ నాయకత్వం మాట్లాడుతుంటే.. తెలంగాణలో సీనియర్ మహిళా ప్రజాప్రతినిధులతో ఇలాగేనా వ్యవహరించేదని ప్రశ్నించారు. సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగారని, ఆ సమయంలో కోవ లక్ష్మి అడ్డుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. జరిగిన పరిణామాలతో సునీతా లక్ష్మారెడ్డి కన్నీళ్లు పెట్టుకోవడం బాధాకరమన్నారు. “ఇది శాసనసభలా లేదు.. దుశ్శాసన సభలా మారింది” అని తీవ్రంగా వ్యాఖ్యానించారు. అయితే బీఆర్ఎస్ ఆరోపణలను ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి ఖండించారు. నల్ల టీషర్టులు ధరించడం నేరం కాదని, వాటిపై ఉన్న కొన్ని పదాలపైనే అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఆ కారణంగానే వాటితో అసెంబ్లీలోకి అనుమతించలేదని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పోలీసులు అసభ్యంగా ప్రవర్తించలేదన్నారు. స్పీకర్ సూచనల మేరకే పోలీసులు వ్యవహరించారని పేర్కొన్న డీసీపీ.. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనకు సంబంధించిన వీడియోలను పరిశీలిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణలనూ పరిశీలిస్తామని చెప్పారు. ఈ ఘటన యాదృచ్ఛికంగా జరిగింది కాదని, ప్రధాన ప్రతిపక్షాన్ని సభకు దూరంగా ఉంచేందుకు పథకం ప్రకారం వ్యవహరించారని కేటీఆర్, హరీశ్‌రావు ఆరోపించారు. 22--ఏ భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ప్రభుత్వ వైఫల్యాలపై చర్చ జరగకుండా బీజేపీ, కాంగ్రెస్ ‘మ్యాచ్ ఫిక్సింగ్’ రాజకీయాలకు పాల్పడుతున్నాయని హరీశ్‌రావు విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేలతో జరిగినట్లు చెబుతున్న ఘటనలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. మరోవైపు పోలీసులపై చేసిన ఆరోపణలను వీడియో ఆధారాలతో పరిశీలిస్తామని డీసీపీ ప్రకటించడంతో ఈ వివాదం మరింత రాజకీయ వేడి రేపుతోంది.

# ఫీజు బకాయిలు చెల్లించేదాకా పోరు ఆగదు

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

**ఫీజు బకాయిలపై అసెంబ్లీ ముట్టడి**

**ప్రభుత్వ తీరుపై ఎంపీల ఆగ్రహం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (చురకలు):** పేద విద్యార్థులకు చెల్లించాల్సిన రూ. 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, బీజేవైఎం చేపట్టిన అసెంబ్లీ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ధర్నా చౌక్ వద్ద ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేసుకునేందుకు పోలీసులు అనుమతి నిరాకరించడంతోనే అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తెలిపారు. అసెంబ్లీ ముట్టడికి యత్నించిన రామచందర్ రావు సహా బీజేపీ, బీజేవైఎం ముఖ్య నేతలను, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని గోల్కొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులు, పోలీసు నిర్బంధాలకు భయపడేది లేదని, ఫీజుల బకాయిలు పూర్తిస్థాయిలో విడుదల చేసేవరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. పోలీసుల తోపులాట, లాఠీచార్జీల కారణంగా అమీర్‌పేట్ కార్పొరేటర్ సరళ తీవ్రంగా గాయపడి ఐసీయూలో అత్యవసర చికిత్స పొందుతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా 600 మందికి పైగా కార్యకర్తలను అక్రమంగా నిర్బంధించారని నాయకులు ఆరోపించారు. రాష్ట్రంలో ‘చోటా హిట్లర్’ పాలన సాగుతోందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటినే ముట్టడిస్తామని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే హెచ్చరించగా, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని పార్టీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తే పోలీసులు బలప్రయోగానికి దిగారని రాంచందర్‌రావు ఆరోపించారు. తోపులాట, లాఠీచార్జిలో పలువురు నాయకులు, కార్యకర్తలు గాయపడినట్లు పేర్కొన్నారు. ఇటీవల ఎనిమిది లక్షల మంది విద్యార్థుల సంతకాలతో వినతిపత్రం అందించేందుకు ప్రయత్నించినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని ఆరోపించారు.



# ముగిసిన బీఏసీ సమావేశాలు

**ఈనెల 12 వరకు అసెంబ్లీ**

హైదరాబాద్,సెప్టెంబర్ 7: శాసనసభ, మండలి సమావేశాల నిర్వహణపై జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు ఉభయ సభలను ఈనెల 12 వరకు నిర్వహించాలని బీఏసీలో ప్రాథమికంగా నిర్ణయించారు. సమావేశాల పొడిగింపుపై అవసరమైతే మరోసారి సమీక్ష జరపాలని నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్?కుమార్ అధ్యక్షతన ఇవాళ జరిగిన శాసనసభ బీఏసీ సమావేశంలో ప్రధానంగా ప్రజా సమస్యలపై చర్చించేందుకు అజెండా రూపొందించారు. ఈ భేటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే బలాల హాజరయ్యారు. ఉదయం శాసనసభకు వెళు_న్న తమపై పోలీసులు దౌర్జన్యం చేశారని నిరసిస్తూ బీఆర్ఎస్ ఈ సమావేశాన్ని బహిష్కరించింది. అసెంబ్లీ బీఏసీ సమావేశంలో 22ఏ, ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై స్వల్పకాలిక చర్చలు జరిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇవాళ ఉదయం 22ఏ నిషేధిత భూముల జాబితాపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. దీంతో పాటు మరో 22 కీలకమైన అంశాలపై చర్చ జరిపేందుకు కనీసం 15 రోజుల పాటు అసెంబ్లీలో సమావేశాలు నిర్వహించాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్‌తో పాటు మైనారిటీ అంశాలపైనా అసెంబ్లీలో చర్చలు జరపాలని ఎంఐఎం నేత బలాలా సైతం కోరారు. ఈ నేపథ్యంలో సభలో ఎన్నిరోజులైనా సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కాగా బీఏసీ సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్?ఎస్.. రాష్ట్రంలో ప్రజా సమస్యలు చాలా ఉన్నాయని, అసెంబ్లీని కనీసం 20 నుంచి 30 రోజుల పాటు నడపాలని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్? డిమాండ్ చేశారు. మరోవైపు శాసనమండలి సమావేశాలను వారం రోజులపాటు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించినట్లు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్?రెడ్డి తెలిపారు. సభ్యుల కోరిక మేరకు అవసరమైతే మరిన్ని రోజులు పొడగిస్తామని ఆయన పేర్కొన్నారు. సుఖేందర్?రెడ్డి అధ్యక్షతన తన ఛాంబర్?లో మండలి బీఏసీ సమావేశం జరిగింది. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసన సభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్?బాబు, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, ఎఫ్ఎండీ, శ్రీపాల్ రెడ్డి, శాసన మండలి సెక్రెటరీ డా.నరసింహా చార్యులు పాల్గొన్నారు.

# నా వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కావు

**శాసనసభ ఘటనపై తాతా మధు వివరణ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (చురకలు):** శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వివరణ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించి తాను మాట్లాడని మాటలను తనకు ఆపాదిస్తున్నారని పేర్కొంటూ ఈ విషయంపై తన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక కీలక ప్రకటన చేశారు. శాసనసభలోకి వెళ్లే సమయంలో మహిళా శాసనసభ్యులతో పాటు తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో తోపులాట, ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఈ క్రమంలో తనపై కూడా దాడి జరిగిందని, తన షర్టు, ఫ్యాంటు లాగేందుకు, గొంతు నొక్కేందుకు ప్రయత్నించినట్లు అనిపించిందని పేర్కొన్నారు. కొంతమంది తనను దుర్భాషలాడినట్లు తెలిపారు. ఈ పరిణామాలతో తీవ్ర ఆవేదనకు గురై తనపై దాడి చేసింది ఎవరు.. తన షర్టు లాగేందుకు ఎవరు ప్రయత్నించారు.. అలా చేయమని ఎవరు ఆదేశించారు అంటూ తాను ప్రశ్నించానన్నారు. అయితే ఈ వ్యాఖ్యలను స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవిగా భావించడం సరికాదని స్పష్టం చేశారు. స్పీకర్ వ్యవస్థ పట్ల, వ్యక్తిగతంగా స్పీకర్ పట్ల తనకు ఎంతో గౌరవం ఉందని మధు చెప్పారు. స్పీకర్‌ను ఉద్దేశించి తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. ఒకవేళ తన వ్యాఖ్యల్లో ఏదైనా స్పీకర్‌ను ఉద్దేశించినట్లు భావిస్తే ఆ మాటలను ఉపసంహరించుకుంటున్నానని, అందుకు విచారం వ్యక్తం చేస్తున్నానని అన్నారు. శాసనసభలోకి వచ్చే సమయంలో తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యంగా మహిళా శాసనసభ్యులతో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా శాసనసభ్యులతో తోపులాట జరిగిందని, వారి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా తమ సీనియర్ నాయకులను పోలీసులు అక్కడి నుంచి తీసుకెళ్లారని తెలిపారు. ప్రజాప్రతినిధులతో వ్యవహరించే విషయంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. శాసనసభ్యులపై జరిగినట్లు పేర్కొన్న పరిణామాలపై ప్రభుత్వం స్పందించాలని మధు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాను మాట్లాడిన వ్యాఖ్యలపై ఏర్పడిన వివాదం కంటే శాసనసభలో చోటుచేసుకున్న అసలు పరిణామాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని మధు వ్యాఖ్యానించారు. ప్రజాప్రతినిధుల పట్ల జరిగిన ఘటనలపై సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ‘సమ్మిట్’ ఆహ్వానాలు పంపాలి

**గ్లోబల్ సమ్మిట్ సన్నాహకాలపై సీఎస్ సమీక్ష**

**హైదరాబాద్, సెప్టెంబర్ 7 (చురకలు):** రానున్న ఇన్వెస్ట్ తెలంగాణ -- రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026 నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయంలో ఉన్నతాధికారులతో సోమవారం సమావేశం నిర్వహించి సన్నాహకాలను సమీక్షించారు. గ్లోబల్ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి ప్రముఖులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులు, సీఈఓలు, సీఎక్స్ఓలు, దౌత్యవేత్తలు తదితరులను పెద్ద సంఖ్యలో ఆహ్వానించేలా చర్యలు చేపట్టాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. సమ్మిట్‌కు హాజరుకావాల్సిందిగా ప్రముఖులకు ఈ-మెయిల్స్ ద్వారా అధికారిక ఆహ్వానాలు పంపే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సూచించారు. ‘ఇన్వెస్ట్ తెలంగాణ’ పేరుతో నిర్వహించనున్న ఈ గ్లోబల్ సమ్మిట్ ద్వారా పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి విస్తృతంగా పరిచయం చేయడంతో పాటు రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్టించేందుకు కృషి చేయాలని సీఎస్ పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో సమయపాలనతో కూడిన కార్యాచరణను అమలు చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. సమావేశంలో సీనియర్ అధికారులు కృష్ణ ఆదిత్య, అజిత్ రెడ్డి, అనుదీప్ దురిశెట్టి, నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# భారతీయులపై ద్వేషం.. సింగపూర్ సీరియస్

**జాత్యహంకార వ్యాఖ్యలపై ప్రభుత్వ ఆగ్రహం**

**'సిగ్గుచేటు.. సహించరానివి' అన్న షణ్ముగం**

**పూర్తిస్థాయి విచారణకు పోలీసులకు ఆదేశం**

**ద్వేషపూరిత పోస్టుల తొలగింపునకు చర్యలు**

**బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక**

**సింగపూర్, సెప్టెంబర్ 7 (చురకలు):** సింగపూర్‌లో నివసిస్తున్న భారతీయులు, భారత సంతతి ప్రజలను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో వెలువడుతున్న జాత్యహంకార, ద్వేషపూరిత వ్యాఖ్యలను ఆ దేశ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఇటువంటి వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేస్తూ.. వాటిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని పోలీసులను ఆదేశించింది. ఇటీవల చైనా-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో సంభవించిన ప్రకృతి వైపరీత్యంలో పలువురు సింగపూర్ పౌరులు గల్లంతైన ఘటనతో పాటు ఎయిర్ ఇండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ పెట్టుబడుల అంశాన్ని ముడిపెడుతూ కొందరు సామాజిక మాధ్యమాల్లో భారతీయులను లక్ష్యంగా చేసుకుని అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలపై సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్, సీనియర్ మంత్రులు కె.షణ్ముగం, లీ సీన్ లూంగ్ తీవ్రంగా స్పందించారు. భారతీయులను లక్ష్యంగా చేసుకుని చేసిన జాత్యహంకార వ్యాఖ్యలను సీనియర్ మంత్రి కె.షణ్ముగం తీవ్రంగా ఖండించారు. వాటిని "అత్యంత సిగ్గుచేటు, హేయమైనవి.. ఎంతమాత్రం సహించరానివి"గా అభివర్ణించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి బాధ్యులను గుర్తించాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించినట్లు తెలిపారు. బహుళ జాతులు, మతాలకు చెందిన ప్రజలు కలిసి జీవించే సింగపూర్‌లో సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలకు చోటులేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏ వర్గాన్ని లక్ష్యంగా చేసుకున్నా ద్వేషపూరిత ప్రచారాన్ని ఉపేక్షించబోమని హెచ్చరించింది. జాతి, మత సామరస్యానికి భంగం కలిగించే పోస్టులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని డిజిటల్ అభివృద్ధి, సమాచార మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమ వేదికలను కోరింది. ఆన్‌లైన్‌లో ద్వేషాన్ని రెచ్చగొట్టే చర్యలను సాధారణ విషయంగా మారనివ్వబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల వేదికగా ఏ ఒక్క జాతి లేదా వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని విద్వేషాన్ని వ్యాప్తి చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని సింగపూర్ ప్రభుత్వం హెచ్చరించింది.

# యెమెన్‌లో మళ్లీ భగ్గుమన్న హింస

**నాలుగు రోజుల్లో 117 మంది బలి**

**ప్రభుత్వ దళాలు, హౌతీల భీకర పోరు**

**తాయిజ్, హోదైదాల్లో వైమానిక దాడులు**

**బాబ్ అల్-మందబ్ సమీపంలో ఆందోళన**

**అడెన్, సెప్టెంబర్ 7 (చురకలు):** యెమెన్‌లో అంతర్యుద్ధం మళ్లీ తీవ్ర రూపం దాల్చింది. ప్రభుత్వ బలగాలకు, హౌతీ తిరుగుబాటుదారులకు మధ్య దేశ పశ్చిమ ప్రావిన్సులైన తాయిజ్, హోదైదాల్లో గత నాలుగు రోజులుగా జరుగుతున్న భీకర ఘర్షణల్లో కనీసం 117 మంది మరణించారు. వైద్య వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ పోరులో 54 మంది ప్రభుత్వ సైనికులు ప్రాణాలు కోల్పోగా, హౌతీ అధీనంలో ఉన్న ఆసుపత్రుల సమాచారం ప్రకారం 63 మంది తిరుగుబాటుదారులు మరణించారు. దీంతో ఇరుపక్షాల మృతుల సంఖ్య 117కు చేరింది. వ్యూహాత్మకమైన బాబ్ అల్-మందబ్ జలసంధి సమీపంలో హౌతీలు పెద్ద ఎత్తున దాడులకు దిగడంతో ఈ తీవ్ర ఘర్షణలు ప్రారంభమయ్యాయి. హౌతీల ముందడుగును అడ్డుకునేందుకు ప్రభుత్వ దళాలు జరిపిన మెరుపు ఎదురుదాడులు, వైమానిక దాడులతో యుద్ధ వాతావరణం మరింత వేడెక్కింది. ఇటీవల కాలంలో పశ్చిమ యెమెన్ భూభాగంలో ఇంతటి భారీస్థాయిలో భూతల పోరాటం జరగడం ఇదే మొదటిసారని విశ్లేషకులు భావిస్తున్నారు. 2014 చివర్లో హౌతీలు రాజధాని సనాతో పాటు ఉత్తర ప్రాంతాలను ఆక్రమించుకున్నప్పటి నుంచి మొదలైన ఈ అంతర్యుద్ధం, ప్రస్తుత ఘర్షణలతో మళ్లీ పూర్తిస్థాయి తీవ్ర రూపానికి చేరుతోందని తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.



# 'ఫేక్ వీడియో అని నాకు తెలియదు'

- వివాదంపై అభిజిత్ దీప్కే వివరణ
- రామజన్మభూమి ట్రస్ట్ సీఈవో పేరుతో వీడియో షేర్
- తప్పుదోవ పట్టించే పోస్టంటూ నెటిజన్ల విమర్శలు
- వ్యక్తిగత జీవితంపై అభ్యంతరం లేదన్న దీప్కే
- సామాజిక మాధ్యమాల్లో కొనసాగుతున్న చర్చ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (చురకలు):** రామజన్మభూమి ట్రస్ట్ సీఈవోను లక్ష్యంగా చేసుకుంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తాను షేర్ చేసిన వీడియో నకిలీదని ముందుగా తెలియదని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే వివరణ ఇచ్చారు. వీడియోలో ఉన్న వ్యక్తిని రామజన్మభూమి తీర్థ ట్రస్ట్ సీఈవో జితేంద్ర మిశ్రాగా పేర్కొంటూ చేసిన పోస్టుపై విమర్శలు రావడంతో ఆయన స్పందించారు. "నేను షేర్ చేసిన వీడియో ఫేక్ అని నాకు తెలియదు. ఏదేమైనా ఎవరి వ్యక్తిగత జీవితం వారిది. దానిపై నాకు ఎలాంటి అభ్యంతరం లేదు" అని దీప్కే పేర్కొన్నారు. బాబీ డియోల్ నటించిన 'జమాల్ కుదు' పాటకు ఓ వ్యక్తి నృత్యం చేస్తున్న వీడియోను దీప్కే ఆదివారం తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. అందులో కనిపిస్తున్న వ్యక్తి రామజన్మభూమి తీర్థ ట్రస్ట్ సీఈవో జితేంద్ర మిశ్రా అని పేర్కొన్నారు. వ్యక్తిగత జీవితంలో ఎవరికి నచ్చినట్లు వారు ఉండడంలో తప్పులేదంటూనే.. ధర్మాన్ని కాపాడుతున్నామని చెప్పుకునే బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు తమ ప్రవర్తన గురించి ఆలోచించుకోవాలంటూ వ్యాఖ్యానించారు. అయితే వీడియోలో ఉన్న వ్యక్తి మిశ్రా కాదని తేలడంతో దీప్కే పోస్టుపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తాయి. ఒక రాజకీయ సంస్థ వ్యవస్థాపకుడిగా ఉన్న వ్యక్తి వీడియో వాస్తవికతను నిర్ధారించుకోకుండా ప్రముఖ వ్యక్తికి ఆపాదిస్తూ ఎలా ప్రచారం చేస్తారని పలువురు నెటిజన్లు ప్రశ్నించారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే వీడియోలు, చిత్రాల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందంటూ వ్యాఖ్యానించారు. కాగా, జితేంద్ర మిశ్రా ఇటీవల రామజన్మభూమి ట్రస్ట్ సీఈవోగా నియమితులైనట్లు కథనంలో పేర్కొన్నారు. ఆయన భారత వైమానిక దళంలో ఉన్నత స్థాయిలో సేవలందించి పదవీ విరమణ చేసిన ఎయిర్ మార్షల్ అని తెలిపింది. వీడియో నకిలీదని అంగీకరిస్తూ దీప్కే ఇచ్చిన వివరణతో వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# గ్యాస్ వినియోగదారులకు శుభవార్త

**గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే రీఫిల్ బుకింగ్**

- పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నియమం
- రీఫిల్ బుకింగ్ నిబంధనల్లో మార్పులు
- కేంద్రం నుంచి కీలక ఉత్తర్వులు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (చురకలు):** వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఇకపై గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్‌ను 25 రోజులకే బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో అమల్లో ఉన్న 45 రోజుల వ్యవధిని తొలగిస్తూ.. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఒకే విధంగా 25 రోజుల నిబంధనను వర్తింపజేయాలని నిర్ణయించింది. కొత్త విధానాన్ని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియంలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రీఫిల్ బుకింగ్ విషయంలో పట్టణ, గ్రామీణ వినియోగదారుల మధ్య ఇప్పటివరకు ఉన్న వ్యత్యాసం తొలగిపోనుంది. కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. దేశంలో ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడటంతో పాటు పెండింగ్ రీఫిల్ బుకింగ్‌లు గణనీయంగా తగ్గాయని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలకు అమలు చేస్తున్న 45 రోజుల నిబంధనను సడలించి 25 రోజులకు తగ్గించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో కేంద్రం రీఫిల్ బుకింగ్‌పై తాత్కాలిక పరిమితులు తీసుకొచ్చింది. పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని అమలు చేసింది. ప్రస్తుతం సరఫరా పరిస్థితులు మెరుగుపడటంతో గ్రామీణ ప్రాంతాల్లోని అదనపు పరిమితిని ఎత్తివేసింది. దీంతో ఇక పట్టణమైనా.. పల్లె అయినా 25 రోజుల తర్వాతే మరో ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకునేలా ఒకే నిబంధన అమల్లోకి రానుంది.

# దేశ ప్రగతికి మహిళలే మార్గదర్శకులు

- భారత చరిత్రలో వారి పాత్ర కీలకం
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా
- స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు చెరగని ముద్ర
- అన్ని రంగాల్లో మహిళల అద్భుత విజయాలు
- నాయకత్వ పటిమకు మరిన్ని అవకాశాలు కల్పించాలని పిలుపు
- మహిళా శాసనసభ్యులకు రెండు రోజుల ప్రత్యేక శిక్షణ



**ఫరీదాబాద్, సెప్టెంబర్ 7 (చురకలు):** భారతదేశ చరిత్ర, వారసత్వంలో మహిళలు ఎప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా నిలిచారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు ప్రతి కీలక ఘట్టంలోనూ మహిళలు చెరగని ముద్ర వేశారని కొనియాడారు. నేడు అన్ని రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తూ దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఫరీదాబాద్‌లో జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళా శాసనసభ్యుల కోసం నిర్వహించిన రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఓం బిర్లా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. "భారతదేశ చరిత్రలో మహిళలు ఎప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు, రాజ్యాంగ రూపకల్పన నుంచి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడం వరకు వారి పాత్ర ఎంతో విశిష్టమైనది" అని ఓం బిర్లా పేర్కొన్నారు. దేశ సంస్థాగత నిర్మాణంతో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించడంలోనూ మహిళల సహకారం, నాయకత్వం మరువలేనిదన్నారు. ప్రస్తుత కాలంలో మహిళలు మార్పునకు ప్రతీకలుగా నిలవడమే కాకుండా వివిధ రంగాల్లో అపూర్వ విజయాలు సాధిస్తూ తమ నాయకత్వ సామర్థ్యాన్ని చాటుతున్నారని ప్రశంసించారు. మహిళల్లో సహజసిద్ధంగా ఉన్న నాయకత్వ లక్షణాలను గుర్తించి వాటిని మరింత బలోపేతం చేసేందుకు సరైన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని ఓం బిర్లా అన్నారు. మహిళా సాధికారతతో పాటు వారి సామర్థ్యాలను పెంపొందించే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. మహిళా శాసనసభ్యుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించిన జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రాహత్కర్‌ను ఆయన అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు మహిళా ప్రజాప్రతినిధుల్లో కొత్త స్ఫూర్తిని నింపడంతో పాటు ప్రజాసేవలో మరింత సమర్థంగా పనిచేసేందుకు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ శిక్షణ ద్వారా మహిళా శాసనసభ్యులు కొత్త అంశాలపై అవగాహన పెంచుకుని, తమ నియోజకవర్గాల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలరని ఓం బిర్లా ఆశాభావం వ్యక్తం చేశారు.

# మహిళలపై అనుచిత వ్యాఖ్యలు సహించం

**ప్రతిపక్ష డీఎంకేపై సీఎం విజయ్ తీవ్ర ఆగ్రహం.. డీఎంకే అవినీతిపై సీఎం దాడి**

**అసెంబ్లీలో పాత నివేదికల రచ్చ.. మహిళలపై అనుచిత వ్యాఖ్యలపై హెచ్చరిక**

**చెన్నై, సెప్టెంబర్ 7 (చురకలు):** తమిళనాడు శాసనసభ సాక్షిగా తమిళగ వెట్రి కజగం (టీవీకే) వ్యవస్థాపకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రతిపక్ష డీఎంకేపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం అసెంబ్లీలో పోలీసు శాఖ పద్దులపై జరిగిన చర్చకు ఆయన సమాధానమిస్తూ, డీఎంకే హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను ఆధారాలతో సహా సభ ముందుంచారు. రాజకీయ విమర్శలను ప్రజాస్వామ్యంలో స్వాగతిస్తామని, అయితే మహిళలను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సభ ముఖంగా తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. డీఎంకే నాయకులు ప్రజల తీర్పును గౌరవించకపోవడం వల్లే నేడు ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందని విజయ్ విమర్శించారు. 1977 నాటి సర్కారియా కమిషన్ నివేదికను సభలో ఉటంకించిన సీఎం విజయ్, వీరాణం పైప్‌లైన్ ప్రాజెక్టులో కమీషన్లు దండుకున్న చరిత్ర డీఎంకేదని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ సహా పలువురు సీనియర్ నేతలపై ఈడీ నమోదు చేసిన ఆరోపణలను ఆయన ప్రస్తావించారు. కాంట్రాక్టులు, పార్టీ ఫండ్ల పేరుతో శాతాల వారీగా కమీషన్లు దండుకున్న దాఖలాలు రికార్డుల్లో ఉన్నాయని మండిపడ్డారు. తాను అధికారం కోసం రాజకీయాల్లోకి రాలేదని, ఎంజీఆర్, ఎన్టీఆర్ వంటి మహానాయకుల వారసత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు సేవ చేయడానికే వచ్చానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

# ప్రభుత్వ ఉద్యోగులకు సోషల్ మీడియా కట్టడి?

**కేంద్రం కొత్త నిబంధనలు!.. త్వరలో సోషల్ మీడియా కోడ్..**

**ఉద్యోగులందరికీ ఒకే నిబంధన.. వ్యక్తిగత ప్రచారంపై ప్రత్యేక దృష్టి**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (చురకలు):** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియా వేదికలపై చేసే పోస్టులపై కట్టడి విధించేందుకు గాను ప్రత్యేకంగా 'సోషల్ మీడియా కోడ్ ఆఫ్ కండక్ట్' తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి వేదికల్లో ఉద్యోగుల ప్రవర్తన, పోస్టులపై పరిమితులు విధించే దిశగా కొత్త నిబంధనలు రూపొందిస్తున్నట్లు ఉన్నతాధికార వర్గాలు తెలిపాయి. ఇటీవల ప్రభుత్వ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ అంశాన్ని ప్రస్తావించి, దీనిపై సమగ్రంగా అధ్యయనం చేయాలని సీనియర్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ నూతన నిబంధనలు అమల్లోకి వస్తే హోదాతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఒకే తరహా కోడ్ వర్తిస్తుంది. ఇటీవల కాలంలో కొందరు అధికారులు యూట్యూబ్ ఛానళ్లు నడపడం, ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేయడం, అధికారిక విషయాలపై వ్యక్తిగత అభిప్రాయాలు పంచుకోవడం ఎక్కువవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆయా శాఖల సర్వీస్ రూల్స్ మాత్రమే అమల్లో ఉండటంతో డిజిటల్ మీడియా విస్తృతికి అనుగుణంగా ఏం పోస్ట్ చేయవచ్చు, ఏం చేయకూడదు, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎలాంటి క్రమశిక్షణా చర్యలు ఉంటాయనే అంశాలపై కొత్త కోడ్ ద్వారా స్పష్టత రానుంది.

# ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి కీసరి రాకేష్

- చదువుల వెలుగులు పంచిన గురువుకు అరుదైన గౌరవం
- విద్యార్థుల భవిష్యత్తే తన ధ్యేయంగా..ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు వెలుగై..

**హన్మకొండ/ఆత్మకూరు సెప్టెంబర్ 7** : విద్యారంగంలో విద్యార్థుల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్న దుగ్గొండి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కీసరి రాకేష్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని శ్రీ విశ్వభారతి హైస్కూల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. విద్యార్థులకు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీసేందుకు రాకేష్ చేస్తున్న కృషికి ఈ పురస్కారం లభించింది. విద్యార్థుల్లో విద్యపై ఆసక్తిని పెంపొందిస్తూ, వారి భవిష్యత్తుకు అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందించడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా కీసరి రాకేష్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ తన విద్యారంగ సేవలను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేసిన జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుడిగా



విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తన లక్ష్యమని, భవిష్యత్తులోనూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి మరింత కృషి చేస్తానని చెప్పారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. రాకేష్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల లక్ష్మీపురం గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, శ్రీ విశ్వభారతి హైస్కూల్ సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# ఫుట్బాల్ లో మల్లెమడుగు పాఠశాల విద్యార్థినీలకు కాంస్య పతకాలు

- పిడి కృష్ణయ్యకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

**ఖమ్మం సెప్టెంబర్ 7 :** ఈనెల 4 నుండి 6 వరకు నిజాంబాద్ లో జరిగిన జూనియర్స్ అండర్ 16 ఇయర్స్ బాలికల రాష్ట్రస్థాయి ఫుట్బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు లో ప్రాతినిధ్యం వహించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్లెమడుగు విద్యార్థినిలు కె. అనిత, టి. నవ్య శ్రీ,, ఏ. వెన్నెల, ఎస్కే. నసీమ, వి. పల్లవి లు కాంస్య పతకాలు సాధించారు. ఈ మేరకు ఆ పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సాంబమూర్తి, పిడి బియ్యని కృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా 6న ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును బియ్యని కృష్ణయ్య



పిడి కి అందజేసినట్లు పేర్కొన్నారు. కృష్ణయ్య ఆ పాఠశాలలో పిడి గా క్రీడారంగంలో ఎందరో విద్యార్థులను జాతీయ రాష్ట్ర స్థాయిలలో విజయాలు సాధించుటలో కృషి చేస్తున్నందుకు గాను, జాతీయ స్థాయికి ఖో-ఖో లో చంద్రిక ఫుట్బాల్ లో యువ వర్షిని ,రాష్ట్రస్థాయి ఫుట్బాల్లో రెండు బంగారు పథకాలు , 11 కాంస్య పథకాలు, నాలుగు వెండి పథకాలు, సాధించినట్లు వివరించారు, విద్యార్థులు కె. అనిత, ఫుట్బాల్ లో రాష్ట్రస్థాయి,సీఎం కప్ లో బంగారు పతకం, రాష్ట్రస్థాయి ఫుట్బాల్ సబ్ జూనియర్స్ లో ఒక వెండి పథకం, జూనియర్స్ లో రెండు కాంస్య పథకాలు, టీ. నవ్య శ్రీ గత సంవత్సరం రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఫుట్బాల్ లో వెండి పతకం, ఈ సంవత్సరంలో జూనియర్స్ ఫుట్బాల్ లో రాష్ట్రస్థాయిలో కాంస్య పథకం సాధించి పాఠశాలకు మంచి పేరు తెచ్చారని వెల్లడించారు. విద్యార్థులను , పాఠశాల పిడి కృష్ణయ్యను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబమూర్తి, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షులు అలివేణి,గ్రామ పెద్దలు నూకారపు వెంకటేశ్వరరావు, భోజర్ల సూర్యం, పీట్ల కృష్ణమూర్తి, కృష్ణ,మనోజ్, సైదులు, మాజీ కార్పొరేటర్లు నిరంజన్ కుమార్, లలితా రాణి, జానీ మియా, బట్ట పోతుల సతీష్, పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణవేణి, శారద, హేమలత , సుధాకర్, స్వర్ణలత,బ్రహ్మచారి, దేవమనమ్మ, వెంకటేశ్వర్లు, అరుణ, సుజాత, బలమని, సహదేవ్ రాజకుమారి , నవీన్ ఉపేందర్ తదితరులు అభినందనలు ప్రకటించారు.

# చీకుర్తి ఉన్నత పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**న్యాల్‌కల్, సెప్టెంబర్ 7:**

న్యాల్‌కల్ మండల పరిధిలోని చీకుర్తి ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరుపుకోవడం జరిగిందని హెచ్ఎం రేష్మ యాస్మీన్ తెలిపారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి ఉపాధ్యాయులు, విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారి గురించి మాట్లాడడం జరిగింది. గురువు యొక్క గొప్పతనం, గురువు మంచి సద్గురువు లాగా ఉండాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు తమకు తాను సర్వం కోల్పోతూ విద్యార్థులకు జ్ఞానం అందిస్తారని చెప్పడం జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయులకు తగిన బహుమతి ఇచ్చి కేక్ కట్ చేయించడం జరిగింది. ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మానం చేయడం జరిగింది. పాల్గొన్న వారు: ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వరూప రాణి, రాజేశ్వరి, హంస, స్వామి, సుధాకర్, నవ ప్రసాద్, జావేద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు చెల్లించాలని బిజెపి లడాయి

- ఇందిరా పార్క్ ధర్నాకు వెళ్లకుండా వలిగొండ మండల బిజెపి నాయకుల ముందస్తు అరెస్ట్.

**వలిగొండ సెప్టెంబర్ 07** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ తలపెట్టిన ఫీజు బకాయి, బిజెపి లడాయి ఇందిరా పార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాకు వలిగొండ మండలం నుండి ఎవరు వెళ్లకుండా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల నాయకులను కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేయడం జరిగింది. వారిని బిజెపి నిర్వహించే ధర్నాకు వెళ్లకుండా అడ్డుకోవడం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసే కుట్రపూరిత రాజకీయాలకు నిదర్శనం అని చెప్పవచ్చు. కానీ అరెస్టుల ద్వారా బిజెపి నిర్వహించే ప్రజా పోరాటాలను అడ్డుకోలేదని బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు శ్రీ బోళ్ల సుదర్శన్ పత్రికా ముఖంగా తెలియజేయడం జరిగింది. రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీ అధికారం చేపడుతుందని, ప్రజలకు సుపరిపాలన అందిస్తుందని వారు తెలియజేశారు. అరెస్ట్ అయిన వారిలో బిజెపి జిల్లా నాయకులు బంధారపు లింగస్వామి, కనతాల అశోక్ రెడ్డి, రాచకొండ కృష్ణ, మైసొల్ల రామ నర్సు, మండల నాయకులు మందుల నాగరాజు, బుంగమట్ల చిన్న మహేష్, పోలు నాగయ్య, సంక బుడ్డి హరికృష్ణ తదితర కార్యకర్తలు ఉన్నారు.




# హౌస్ అరెస్టులతో ఉద్యమాన్ని అడ్డుకోలేరు



- ప్రజా సమస్యలపై బీజేపీ పోరాటం ఆగదు... డా.గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి

**వరంగల్, సెప్టెంబర్ 7** : 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలను హౌస్ అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి అన్నారు. తనను వరంగల్‌లోని స్వగృహంలో, నర్సంపేట నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నాయకులను పోలీసులు హౌస్ అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పిలుపు మేరకు చేపట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకే ఈ నిర్బంధాలు చేపట్టారని ఆయన ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును ప్రభుత్వం కాలరాయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజా సమస్యలపై పోరాడుతున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్యానికి పరాకాష్ఠ అని విమర్శించారు. 1975లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీకి ఎదురొడ్డి పోరాడిన చరిత్ర తమదని పేర్కొన్నారు. పోలీసులతో అక్రమ నిర్బంధాలు చేయించవచ్చేమో కానీ ప్రజా సమస్యలపై బీజేపీ చేస్తున్న పోరాటాన్ని మాత్రం ఆపలేరని స్పష్టం చేశారు. అక్రమ అరెస్టులతో సమస్యలు పరిష్కారం కావని, ప్రజా సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని డా.రాణా ప్రతాప్‌రెడ్డి అన్నారు.

# ఉద్యమకారులను గుర్తించాలని ప్రజావాణిలో దరఖాస్తు అందజేత

## సంగిశెట్టి క్రిస్టఫర్ జోగు అంజయ్య మలిదశ ఉద్యమకారులు.




**వలిగొండ సెప్టెంబర్ 07 :** స్వరాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులను గుర్తించాలని వలిగొండలో ప్రజావాణిలో దరఖాస్తు అందజేసిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య లు సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు అంద చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల సంక్షేమం గుర్తింపు పట్ల క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు ఉద్యమకారులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రభుత్వం దగ్గర స్పష్టమైన సమాచారం ఉందని కానీ ప్రత్యేక వెబ్సైటు ప్రారంభించాలని కాలయాపన చేయవద్దని వారు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికీ అనేక మంది ఉద్యమకారులు చనిపోయారని మరికొంతమందిని ఆదుకోవడానికి వేగంగా అడుగులు వేయాలని వారు అన్నారు.

# మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విధ్యానిది పథకానికి దరఖాస్టులకు ఆహ్వానం

## జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వై. మాధవరెడ్డి



**వికారాబాద్ ,సెప్టెంబర్,07** మహాత్మా జ్యోతిబా పులే ఓవర్సీస్ విద్యానిధి పథకానికి 2026 ఆగస్టు/సెప్టెంబర్ పాల్ సెషన్ కు సంబందించిన దరఖాస్తులను తేది 01.09.2026 నుండి తేది 30.09.2026 వరకు ఆహ్వానించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి తెలిపారు. ఆసక్తి గల బి.సి మరియు ఈబిసి విద్యార్థులు http://telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని శ్రీ వై.మాధవ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వికారాబాద్ జిల్లా ఒక ప్రకటనలో తెలిపారు. కావున విదేశాలలో ఉన్నత విద్య (మాస్టర్స్ /డాక్టరేట్ ) అభ్యసించే బి.సి మరియు ఈ బి సి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేయసుకోవలన్నారు.

**కావాల్సిన అర్హతలు :**

1.కుటుంబ వార్షిక ఆదాయము రూ. 5,00,000/- లక్షల లోపు ఉండాలి.
2. దరఖాస్తు చేయు సమయమునకు వయస్సు (35) సంవత్సరాలలోపు కలిగి వుండాలి.
3.డిగ్రీలో 60 శాతము మార్కులు సాధించిన న వారు మాత్రమే అర్హులు.
4. GRE-260 మార్కులు లేదా G-MAT 500 మార్కులు ఏదైనా ఒక పరీక్షలో సాధించి వుండాలి.
5. TOFEL-60 మార్కులు లేదా IELTS-6.0 మార్కులు లేదా PTE-50 మార్కులు ఏదైనా ఒక పరీక్షలో సాధించి వుండాలి.
6. దరఖాస్తుతో పాటు అభ్యర్థి ఫొటో, మీ సేవా కేంద్రం నుంచి కులం, స్థానికత , ఆదాయ ధృవీకరణ , పుట్టిన తేది ధృవీకరణ , ఆధార్ కార్డు, ఈ పాస్ ఐ.డి నెంబర్, పాస్ పోర్ట్ కాపీ పదవ తరగతి నుండి డిగ్రీ పీజీ లెవెల్ ధృవ పత్రాలు, మరియు జాతీయ బ్యాంకు పాస్ పుస్తకం తదితర పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది
7. ఒక కుటుంబం నుండి ఒక విద్యార్థికి మాత్రమే ఈ యొక్క స్కీం వర్తిస్తుంది.

ఈ దరఖాస్తులను బి. సి. సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలోని కమిటి పరిశీలించి ఎంపిక చేయటం జరుగుతుంది. ఎంపికైన విద్యార్థులకు రెండు విడుతల్లో వారు ఎంపిక చేసుకున్న యునివర్సిటీ నిర్ణయించిన ఫీజును బట్టి ఉపకార వేతనం మంజూరు చేయడం జరుగుతుంది. మరిన్ని వివరాలకు http://telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ ను సంప్రదించగలరు.

# కేటీఆర్, హరీశ్‌రావు అరెస్టులకు నిరసనగా రాస్తారోకో

## ఆలేరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన

**ఆలేరు, సెప్టెంబర్ 7** : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆలేరులో బీఆర్ఎస్ మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో సోమవారం బస్టాండ్ ఎదుట పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. హామీల అమలును ప్రశ్నిస్తూ నల్లచొక్కాలు ధరించి అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. మహిళా నాయకులను సైతం పోలీసులు బలవంతంగా తీసుకెళ్లడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం గౌరవించాలని, అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ బొట్ల పరమేశ్వర్, సెక్రటరీజనరల్ ఉండే సంపత్, కౌన్సిలర్లు యాట శివ, పాకాల మౌనిక, హరీశ్, బీజని మధుకుమార్, మాజీ కౌన్సిలర్ బేతి రాములు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అందించే సంక్షేమ పథకాలను కొనసాగించాలి

## బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో డిప్యూటీ ఎమ్మార్వోకు వినతి పత్రం



**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,07** కొడంగల్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆదేశాల మేరకు పేదలకు అందించే సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని సోమవారం కొడంగల్ డిప్యూటీ ఎమ్మార్వో కు వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా రెండోవాడు మాజీ కౌన్సిలర్ మధు సూదన్ యాదవ్, ఉద్యమకారులు,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏరన్ పల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నిరుపేదలకు అందించే ఇందిరమ్మ ఇండ్లు, కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్, తులం బంగారం,ఆడపిల్లలకు స్కూటీలు అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూం ఇండ్లు, కొత్త పెన్షన్లు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు 2000 నుండి 4000,4000 నుండి 6000 వెంటనే అమలు చేయాలని ప్రధానంగా డిమాండ్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రావులపల్లి మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, బి ఆర్ఎస్ నాయకులు శరణప్ప, ఏర్పుల మోహన్, గుండ్లకుంట బాలరాజు,వెంకటయ్య,జగన్, హనుమంతు,రాజశేఖర్ లక్ష్మారెడ్డి బిచ్చప్ప రఫిక్, శివ పశుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలి

## బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా...జేఏసీ జిల్లా కన్వీనర్ ముంజాల రాజేందర్ గౌడ్




**మహబూబాబాద్, సెప్టెంబర్ 7** : విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం మహబూబాబాద్‌లో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని ఎంఆర్‌ఓ కార్యాలయ ప్రాంతంలో జరిగిన ఆందోళనకు జేఏసీ జిల్లా కన్వీనర్ ముంజాల రాజేందర్‌గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సంబంధించిన సుమారు రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. బకాయిల విడుదలలో జాప్యం వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ధర్నా చేపట్టినట్లు తెలిపారు. నిధులు విడుదల చేసి విద్యార్థుల చదువులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనలను కొనసాగిస్తామని జేఏసీ జిల్లా కన్వీనర్ ముంజాల రాజేందర్‌గౌడ్ తెలిపారు. ధర్నాకు మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ జెరిపోతుల వెంకన్నగౌడ్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి మంగళంపల్లి రాజు, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ లక్ష్మణ్, జేఏసీ కో–కన్వీనర్ గండి వీరేందర్‌గౌడ్, డీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి నేతుల వెంకన్నయాదవ్, దాసరి లక్ష్మీనివాస్ మహారాజ్, గూడెల్లి బిక్షపతి మహారాజ్, దుగ్గి గోపాల్ రజక, పి.దశరథం బేస్తా, పేరం వీరస్వామి ఎరుకల, ఏర్పుగొండ గణేష్, వల్లందాస్ సతీష్, కేలోతు సాయికుమార్ మహారాజ్, గూగులోతు సూర్యప్రకాశ్, ఆర్.సంతోష్, కొమ్ము ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రావి నారాయణరెడ్డి పోరాట స్ఫూర్తితో యువత పనిచేయాలి

## సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్




**ఆలేరు, సెప్టెంబర్ 7** : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, అమరజీవి కామ్రేడ్ రావి నారాయణరెడ్డి 35వ వర్ధంతిని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ పార్టీ కార్యాలయంలో రావి నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రావి నారాయణరెడ్డి సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. తెలంగాణ విముక్తి పోరాటంలో కీలక పాత్ర పోషించి, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించారని పేర్కొన్నారు. పేదలకు భూమి పంపిణీ కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. దొరలు, భూస్వాముల పెత్తనానికి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచిన రావి నారాయణరెడ్డి ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని చెక్క వెంకటేష్ కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కందుల మధు, పేరపు రాములు, బర్మా ఉప్పలయ్య, పల్లె వెంకటేష్, బీరయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలుకు మోక్షమెప్పుడు?

- ఆరు గ్యారంటీలు.. 420 హామీలు ఎక్కడ.?
- వెయ్యి రోజులు గడిచినా అమలేది.. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన



**నర్సంపేట, సెప్టెంబర్ 7** : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నర్సంపేటలో నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర రైతు డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఆచరణ సాధ్యం కాని హామీలను ఇచ్చిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు, కార్మికులు తదితర అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. హామీలన్నింటినీ అమలు చేసే వరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, మాజీ డివిజన్ కోఆర్డినేటర్ తక్కలపల్లి రవీందర్‌రావు, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, మాజీ ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ నాడెం శాంతికుమార్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, కౌన్సిలర్ శివరాత్రి స్వామి, నవీన్‌నాయక్, మాజీ కౌన్సిలర్ నాగిశెట్టి ప్రసాద్, బండి ప్రవీణ్, దార్ల రమాదేవి, పెండెం వెంకటేశ్వర్లు, గందె చంద్రమౌళి, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు రాయిడి దుష్యంత్‌రెడ్డి, క్లస్టర్, వార్డు

# యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో అవకాశాలు కల్పించాలి

- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ వినతి

**ఆలేరు, సెప్టెంబర్ 07** : ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న నిరుపేద గ్రామీణ యువతకు మరింత మెరుగైన శిక్షణ అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ సభ్యులకు, సంస్థ ద్వారా శిక్షణ పొందుతున్న విద్యార్థులకు అవకాశాలు కల్పించాలని కోరుతూ ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు సంస్థ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పోలీసు ఉద్యోగాలకు సిద్ధమవుతున్న గ్రామీణ ప్రాంతాల నిరుపేద యువతకు సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ కొంతకాలంగా ఉచితంగా మార్గదర్శకత్వం అందిస్తోంది. ఉద్యోగ నోటిఫికేషన్ల సమాచారం, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, ఏ విధంగా చదవాలి, శారీరక దారుఢ్య పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఎలాంటి గ్రౌండ్ ప్రాక్టీస్ చేయాలి తదితర అంశాలపై వాట్సాప్ మాధ్యమం ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా కొనసాగిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు దాదాపు 200 మంది యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా సంస్థ తనవంతు కృషి చేసిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల సాధనపై అవగాహన కల్పిస్తూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో తమ సంస్థ సభ్యులకు తగిన ఉద్యోగ, శిక్షణ అవకాశాలు కల్పించాలని, సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ ద్వారా ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న నిరుపేద విద్యార్థులకు సెంటర్‌లో శిక్షణ పొందే అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేను



కోరారు. సంస్థ అందిస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి, మరింత మంది యువతను దేశ సేవకు సిద్ధం చేయడంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పందిస్తూ గ్రామీణ యువతకు ఉచితంగా మార్గదర్శకత్వం అందిస్తూ వారిని ఉద్యోగులుగా తీర్చిదిద్దేందుకు సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ చేస్తున్న కృషిని అభినందించారు. సంస్థ చేస్తున్న ఈ బృహత్కార్యంలో తనవంతుగా, ప్రభుత్వం ద్వారా అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. సంస్థ కోరిన విధంగా యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే గ్రామీణ ప్రాంత యువతను ప్రోత్సహిస్తూ, వారికి నిరంతరం మార్గదర్శకత్వం అందిస్తున్న సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ ఫౌండర్, జనరల్ సెక్రటరీ బండారి ప్రసాద్ ముదిరాజ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ ప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కొలనుపాక సోమేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

- సోమేశ్వర స్వామికి ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు
- కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ సందర్శన, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు



**ఆలేరు, సెప్టెంబర్ 07** : ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సోమవారం ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్వామివారికి భక్తి శ్రద్ధలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని పలు సన్నిధులను దర్శించుకుని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. రాష్ట్ర ప్రజలు, ఆలేరు నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని శ్రీ సోమేశ్వర స్వామివారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఆయన కుటుంబ సభ్యులకు తీర్థప్రసాదాలు అందజేసి స్వామివారి ఆశీర్వచనాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను అర్చకులు వివరించారు. ఎమ్మెల్యే ఆలయానికి రావడంతో భక్తులు, స్థానికులు ఆయనను కలుసుకుని అభినందనలు తెలిపారు.

# వర్షపు నీటి నిలువ పనులను పరిశీలన

- తాటి, ఈత చెట్లను నరికే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి... మోకుదెబ్బ రమేష్‌గౌడ్



**నర్సంపేట, సెప్టెంబర్ 7** : గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గౌడ జన హక్కుల పోరాట సమితి 'మోకుదెబ్బ' జిల్లా నాయకుడు అనంతుల రమేష్‌గౌడ్ కోరారు. తాటి, ఈత చెట్లను నరికే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గౌడ కులస్థులకు అన్యాయం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.నర్సంపేట నియోజకవర్గ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిద్దగోని జయశ్రీని సోమవారం గౌడ జన హక్కుల పోరాట సమితి 'మోకుదెబ్బ' వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా అనంతుల రమేష్‌గౌడ్ మాట్లాడుతూ తాటి, ఈత చెట్లను అక్రమంగా నరికివేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతర కులాలకు చెందిన వారికి గీత కార్మికుల లైసెన్సులు ఇవ్వకుండా, గౌడ కులస్థుల హక్కులను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. గౌడ కులస్థులు సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ వారం రోజుల్లో సభ్యత్వం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సీఐని కోరారు. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్‌గౌడ్, సలహాదారు సొల్టి సారయ్యగౌడ్, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి కందుల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కోశాధికారి మర్ద గణేష్‌గౌడ్, గంప రాజేశ్వర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు తాబేటి శ్రీనివాస్‌గౌడ్, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు గోడిశాల మల్లయ్యగౌడ్, దుగ్గొండి మండల అధ్యక్షుడు తడుక కొమురయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక

**నారాయణపేట, సెప్టెంబర్, 07** ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 12 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా సత్వరం పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్కరించాలి.అదనపు కలెక్టర్ శ్రీను,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



చురకలు



# సైబర్ భద్రతపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించిన: జిల్లా ఎస్పీ

**నారాయణపేట,సెప్టెంబర్,07**
తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా రూపొందించిన సైబర్ భద్రత అవగాహన వాల్ పోస్టర్‌ను సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆవిష్కరించారు.వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌లో సైబర్ మోసాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వినూత్నంగా వివరించారు. వినాయకుడి పెద్ద చెవులు ప్రతి విషయాన్ని జాగ్రత్తగా వినాలని, చిన్న కళ్లతో నిశితంగా గమనించాలని, పెద్ద తలతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నట్లుగా పోస్టర్‌లో అవగాహన కల్పించారు. అత్యాశ, భయం, తొందరపాటు వంటి భావోద్వేగాలను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుంటారని, ప్రతి గణేష్ మండపం దగ్గర ఈ అవగాహన వాల్పోస్టర్ ఏర్పాటు చేయాలని అందుకు మండప యజమానులు ఏర్పాటు చేసి ప్రజలకు అప్రమత్తం చేయాలని ఎస్పీ సూచించారు.తెలియని వ్యక్తుల నుంచి




వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, ఈ–మెయిల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం, గుర్తుతెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం చేయవద్దన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం/డెబిట్ కార్డు సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ, పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి



పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు.ఆన్‌లైన్ ఉద్యోగాలు, పెట్టుబడులు, రుణాలు, బహుమతులు, లాటరీల పేరుతో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి మోసపోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దన్నారు. ఖాతాల భద్రత కోసం బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకుని టూ–ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ వినియోగించాలని తెలిపారు.ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని,www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. మోసం జరిగిన వెంటనే స్పందిస్తే డబ్బును తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పేట ఇంచార్జి సైబర్ క్రైం డీఎస్పీ కాజల్ జస్వాల్, RI విజయభాస్కర్, జిల్లా సైబర్ టీం పోలీసులు రమేష్, పవన్ తది తరులు పాల్గొన్నారు.

# ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

- **అసెంబ్లీ సమావేశాల్లో అధికారిక ప్రకటన చేయాలి**
- **అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా**




**ఆలేరు, సెప్టెంబర్ 07** : రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని అఖిలపక్ష కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఆలేరు పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కమిటీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా అఖిలపక్ష కమిటీ నాయకులు మాట్లాడుతూ ఆలేరు పేరుకే అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా ఉందని, అన్ని రంగాల్లో వెనుకబడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలేరు సమగ్ర అభివృద్ధి సాధించాలంటే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడం అత్యవసరమన్నారు. గత ఐదేళ్లుగా రెవెన్యూ డివిజన్ సాధన కోసం అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు, ఆందోళనలు నిర్వహించినట్లు తెలిపారు. డివిజన్ ఏర్పాటు పై హామీ ఇచ్చి అమలుకు నోచుకోలేదని ఆరోపణ

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బీర్ల అయిలయ్య ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని కమిటీ నాయకులు గుర్తుచేశారు. ఎన్నికల ప్రచార సభల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సైతం ఈ అంశంపై హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఆలేరు రెవెన్యూ డివిజన్ అంశాన్ని ప్రస్తావించి ఓట్లు కోరారని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత హామీ అమలుపై చిత్తశుద్ధి కనిపించడం లేదని విమర్శించారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యాలయాలు తరలిపోతే నియోజకవర్గానికి నష్టం

గత పాలకుల అసమర్థత కారణంగా ఆలేరు అభివృద్ధి క్రమంగా కుంటుపడుతోందని నాయకులు ఆరోపించారు. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఉండాల్సిన ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో జరిగే నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)లో ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గం ఉనికికే ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడం ద్వారా నియోజకవర్గ కేంద్రంగా దాని ప్రాధాన్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లోనే ఆలేరు రెవెన్యూ డివిజన్‌పై అధికారిక ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం, కో–కన్వీనర్ రాచకొండ జనార్దన్, మామిడాల బిక్షపతి, చెక్క వెంకటేష్, మొరిగాడు చంద్రశేఖర్, పుట్ట మల్లేష్, కమిటీ సభ్యులు అశోక్, కళ్లెపు అడవయ్య, కౌన్సిలర్లు యాట శివ, బీజం మధు, నాయకులు పేరపు రాములు, బేతి రాములు, సీస సత్తయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బొట్ల పరమేశ్వరి, అంబేద్కర్ యువజన సంఘం సభ్యుడు తుంగ కుమార్, గడ్డం నాగరాజు, ఇక్కిరి శ్రీనివాస్, మామిడాల బాల మల్లేష్, కుర్రి సత్యనారాయణ, ఇరుగదెండ్ల వెంకటేష్, సీపీఐ నాయకుడు కందుల మధు, మైదం భాస్కర్, కుండే సంపత్, బర్మా ఉప్పలయ్య, జి.స్వామి, వెంకటేష్, పల్లె ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాగళాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధం

- **బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడంపై నిరసన**
- **హనుమకొండలో దిష్టిబొమ్మ దహనం.. దాస్యం వినయ్ భాస్కర్ సహా పలువురు అరెస్టు**

**హనుమకొండ, సెప్టెంబర్ 7** : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా ప్రభుత్వం వ్యవహరించిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి. పార్టీ పిలుపు మేరకు మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ చౌరస్తాలో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ వైఖరికి నిరసనగా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజల తరఫున తమ వాణిని శాసనసభలో వినిపించాల్సిన ప్రజాప్రతినిధులను సభకు రాకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అసెంబ్లీ ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించే ప్రజాస్వామ్య వేదిక అని, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు తమ నియోజకవర్గాల సమస్యలను సభలో ప్రస్తావించే హక్కు ఉందని పేర్కొన్నారు. ప్రజల గొంతుకగా నిలిచే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సభకు దూరంగా ఉంచే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని తెలిపారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం కావని, ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు సభలో మాట్లాడే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా సమస్యలకు పరిష్కారం లభించదని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీలో ప్రజా సమస్యలు లేవనెత్తకుండా అడ్డుకునే చర్యలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. రాస్తారోకోతో హనుమకొండ చౌరస్తాలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి దాస్యం వినయ్‌భాస్కర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



# చలో హైదరాబాద్ సభకు సహకరించాలి..

**ఎం.బి కృష్ణ యాదవ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 07:**

ఈ నెల 10వ తేదీన తలపెట్టిన ఉద్యోగుల చలో హైదరాబాద్ సభను విజయవంతం చేయాలని కోరుతూ వివిధ ప్రభుత్వ శాఖలను కలిసి అనుమతి కోరిన తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ ప్రెసిడెంట్ ఎంబి కృష్ణయాదవ్. ఇందులో భాగంగా సభకు మద్దతు కోరుతూ జిహెచ్ఎంసి, ఎంఎంసీ, సిఎంసి లలో పనిచేస్తున్న రెవెన్యూ మరియు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమ సభకు మద్దతు ఇవ్వాలని మూడు కార్పొరేషన్ల కమిషనర్లకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మంద రవి, కే దేవేందర్, వి గంగాధర్, పి మురళీకృష్ణ, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు



# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచలేరు

- **తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిజాం నిరంకుశ పాలనను తలపిస్తోంది: బీజేపీ మండల అధ్యక్షుడు పూజారి కుమారస్వామిగౌడ్**



**ఆలేరు, సెప్టెంబర్ 07** : ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ చేపడుతున్న శాంతియుత ఉద్యమాలను పోలీసుల ద్వారా అడ్డుకోవడం, నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీజేపీ ఆలేరు మండల అధ్యక్షుడు పూజారి కుమారస్వామిగౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి నిజాం నిరంకుశ పాలనను తలపిస్తోందని ఆయన విమర్శించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఫీజు బకాయి బీజేపీ లడాయి' కార్యక్రమంలో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన విద్యార్థుల మహాధర్నాకు బయలుదేరిన ఆలేరు బీజేపీ నాయకులను పోలీసులు ఉదయం అరెస్టు చేశారని తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యార్థులు, రైతులు, నిరుద్యోగులు, మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజా సమస్యలపై బీజేపీ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలను అడ్డుకోవడం సరికాదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నాయకులను అరెస్టు చేయడం ద్వారా ఉద్యమాలను అణచివేయలేరని స్పష్టం చేశారు. అక్రమ అరెస్టులతో బీజేపీ ఉద్యమాలను నిలువరించలేరని కుమారస్వామిగౌడ్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో కార్యాచరణ రూపొందించి, ప్రజలను చైతన్య పరిచి ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల తరఫున బీజేపీ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ టౌన్ ప్రధాన కార్యదర్శి ఏలగల వెంకటేష్, కౌన్సిలర్ పాశికంటి సంపత్, జిల్లా కిసాన్ మోర్చా నాయకుడు కంతుల శంకర్, జిల్లా యువ మోర్చా నాయకులు శాంతిరెడ్డి, కొరుటూరి మధు తదితరులు పాల్గొన్నారు.

# ఏటిగడ్డ హనుమాన్ ఆలయంలో శ్రావణ సోమవార వేడుకలు:

**భక్తులకు అన్నప్రసాద వితరణ**

**పోతంగల్, సెప్టెంబర్ 07:** శ్రావణ మాసం మూడవ / ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని పోతంగల్ మండల పరిధిలోని కల్లూరు గ్రామం ఏటిగడ్డ వద్ద ఉన్న శ్రీ హనుమాన్ మందిరం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే హనుమాన్ స్వామివారికి విశేష అర్చనలు, పూజా కార్యక్రమాలు పూర్తి చేసి, అనంతరం భక్తులకు మహా అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... ఏటిగడ్డ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ప్రతి ఏటా శ్రావణ మాసంలో అన్నదానాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, భక్తుల సహకారంతో ఈ సంప్రదాయాన్ని ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ అన్నదాన మహోత్సవంలో కల్లూరు గ్రామానికి చెందిన భక్తజనం, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవలు అందించారు.



# 4వ వార్డులో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలి

**మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా**

**ఆలేరు, సెప్టెంబర్ 7** : ఆలేరు మున్సిపాలిటీలోని 4వ వార్డులో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, వీధిదీపాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు ఎం.ఏ. ఇక్బాల్, పట్టణ నాయకుడు మోరిగాడి రమేష్ లు మాట్లాడుతూ 4వ వార్డులో కాలనీ ఏర్పడి 40–50 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ సీసీ రోడ్లు, మురుగు కాలువలు పూర్తిస్థాయిలో నిర్మించలేదన్నారు. వర్షాకాలంలో మురుగు, వర్షపు నీరు ఇళ్ల ముందు నిలిచిపోవడంతో దోమలు, పందుల బెడద పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాటమయ్యబస్తీ ప్రధాన రహదారిపై గతంలో నిర్మించిన సీసీ రోడ్డు ఆరు నెలల్లోనే గుంతలమయమై ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందన్నారు. ద్వారకా నగర్, కాటమయ్యబస్తీ, చింతల్‌బస్తీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సమస్యలను 30 రోజుల్లో పరిష్కరిస్తామని, కొత్త సీసీ రోడ్డు నిర్మిస్తామని, మురుగు కాలువను పెద్దవాగు వరకు పొడిగిస్తామని గతంలో అధికారులు హామీ ఇచ్చినా అమలు చేయలేదని విమర్శించారు.సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాయకులు, కాలనీవాసులు నినాదాలు చేశారు. అనంతరం కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో మేనేజర్ జగన్మోహన్కు వినతిపత్రం అందజేశారు. సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మోరిగాడి చంద్రశేఖర్, వడ్డేమాన్ బాలరాజు, ఘనగాని మల్లేశం, యాసారపు ప్రసాద్, ఎం.డి. ఖలీల్, ఘనగాని రాజు తదితరులు పాల్గొన్నారు.

చురకలు



# ప్రజారోగ్యమే ధ్యేయంగా.. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

- పిచ్చి మొక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- 5వ వార్డులో గడ్డి మందు పిచికారి.. కౌన్సిలర్ పొన్నాల మనీషా ప్రకాష్



**నర్సంపేట, సెప్టెంబర్ 7** : నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వార్డులోని పలు ప్రాంతాల్లో పెరిగిన పిచ్చి, కలుపు మొక్కలను నియంత్రించేందుకు గడ్డి మందు పిచికారి కార్యక్రమం నిర్వహించారు. వర్షాలు, వాతావరణ పరిస్థితుల కారణంగా ఖాళీ ప్రదేశాలు, రహదారుల పక్కన, డ్రైనేజీల పరిసరాల్లో కలుపు మొక్కలు అధికంగా పెరిగే అవకాశం ఉండటంతో ముందస్తు చర్యల్లో భాగంగా మందు పిచికారి చేపట్టినట్లు తెలిపారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారకుండా, దోమలు, ఇతర కీటకాల వ్యాప్తికి అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని 5వ వార్డు కౌన్సిలర్ పొన్నాల మనీషా ప్రకాష్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ పారిశుద్ధ్య పనులు ఒకరోజుకే పరిమితం కాకుండా నిరంతరం కొనసాగించాలని సూచించారు. ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, కాలనీలు, ఖాళీ స్థలాలు, డ్రైనేజీ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఎక్కడైనా చెత్త పేరుకుపోయినా, మురుగు నీరు నిలిచినా, పిచ్చి మొక్కలు పెరిగినా వెంటనే గుర్తించి తొలగించాలని సూచించారు. దోమల ఉత్పత్తికి కారణమయ్యే నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మనీషా ప్రకాష్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రమైన వాతావరణమే లక్ష్యంగా వార్డులో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పిచ్చి మొక్కలు, చెత్త, మురుగు నీటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వార్డును పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని, ఇళ్ల ముందు, పరిసర ప్రాంతాల్లో చెత్త వేయకుండా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు డివిజన్ అధ్యక్షులు ఒరంగంటి కుమార్, ఎస్.డి. జావేద్, ప్రధాన కార్యదర్శి శివరాత్రి నాగరాజు, ఉపాధ్యక్షుడు మాసు స్వామి, గౌరవ అధ్యక్షుడు ఆకులపెల్లి రమేష్, సహాయ కార్యదర్శి రాపోలు రామకృష్ణ, యూత్ ఉపాధ్యక్షులు లక్క రాము, చిలక జంపయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జి జంగా సాయి మహేష్, ధర రవి, చిలుక రవి, సాయి కిరణ్, ఎర్రం మహేష్, జవాన్ కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ నేతల నిరసన

**హైదరాబాద్ సెప్టెంబర్ 7** : వర్షాకాల అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి నివాళులు అర్పించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు గడిచినా వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నిరసన తెలిపారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు నల్ల టీషర్టులతో గన్‌పార్క్ నుంచి బయలుదేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారు. సభలోకి అనుమతి లేదంటూ తమను అడ్డుకోవడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ క్రమంలో పలువురు ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## విద్యార్థుల ఫీజు బకాయిలపై దృష్టి పెట్టాలి

### బీజేపీ నాయకుల అరెస్టులపై ఉన్న శ్రద్ధ.. ఫీజు బకాయిలపై లేదా?... కొంగర రవికుమార్




**గీసుకొండ, సెప్టెంబర్ 7** : విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం దృష్టి సారించాలని బీజేపీ గీసుకొండ మండల అధ్యక్షుడు కొంగర రవికుమార్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలు చేపడుతుంటే వారిని అరెస్టు చేయడంపై చూపుతున్న శ్రద్ధ.. ఫీజు బకాయిల చెల్లింపుపై చూపడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు, వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. బకాయిల చెల్లింపులో జాప్యం కారణంగా కళాశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల తరపున ప్రశ్నిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలపై అరెస్టులు, నిర్బంధాలకు బదులుగా వారి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం గౌరవించాలని, ఆందోళనలను అణచివేయడం ద్వారా సమస్యలకు పరిష్కారం లభించదని రవికుమార్ అన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించి వారి చదువులకు ఆటంకం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు అరకట్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్

- ఉడిమేశ్వరం, అప్పాయిపల్లిలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమలు

**కొడంగల్ మండలం, సెప్టెంబర్,07**



కొడంగల్ మండల పరిధిలోని ఉడిమేశ్వరం గ్రామంలో బొడ్రాయి, వివిధ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం అప్పాయిపల్లి గ్రామంలో నిర్వహించిన సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, మండల పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. వారితో పాటు మండల ఉపాధ్యక్షులు, మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు మెంబర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలతో ఉడిమేశ్వరం, అప్పాయిపల్లి గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి మరియు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు మన సంప్రదాయాలు, సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించడంలో ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.కార్యక్రమానికి హాజరైన భక్తులు, గ్రామస్తులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గ్రామ పెద్దలు, యువత, మహిళలు, భక్తులను నాయకులు అభినందించారు.

# భక్తులకు ఇబ్బంది లేకుండా.. గణపయ్య నిమజ్జన ఏర్పాట్లు

- నిమజ్జనానికి చెరువుల పరిశీలన...మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్
- దామర చెరువు అడుగంటడంతో మాదన్నపేట చెరువులో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



**నర్సంపేట, సెప్టెంబర్ 7** : వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనువైన ప్రాంతాలను గుర్తించేందుకు నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ సోమవారం చెరువులను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, వైస్‌చైర్మన్ గంధం నరేందర్‌గుప్తా, టౌన్ సీఐ ముస్క శ్రీనివాస్‌తో కలిసి దామర, మాదన్నపేట చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ ఈ ఏడాది తగినంత వర్షపాతం లేకపోవడంతో దామర చెరువులో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయిందన్నారు. నవరాత్రుల అనంతరం వినాయక విగ్రహాల నిమజ్జనానికి భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై పరిశీలన చేసినట్లు తెలిపారు. మాదన్నపేట చెరువులో అనువైన ప్రాంతాన్ని గుర్తించి, గ్రామస్థులు, అధికారులు, ఉత్సవ కమిటీల సహకారంతో నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ దృష్ట్యా వీలైనంత వరకు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని వినాయక నవరాత్రి ఉత్సవ కమిటీలకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ చంద్రమౌళి, కౌన్సిలర్లు కొత్తకొండ మేఘన–శ్యాంరాజ్, ముత్తినేని వెంకన్న, బీరం భరత్‌రెడ్డి, ఏపూరి శ్రీనివాస్‌రెడ్డి, ఎలకంటి విజయ్‌కుమార్, సలావుద్దీన్ ఆయూబ్‌ఖాన్, పొన్నాల మనీషా–ప్రకాష్, శ్రీరామోజు రోజారాణి, ఇస్లావత్ రామాగోపినాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపెల్లి సందీప్, మార్కెట్ డైరెక్టర్ కొల్లూరి మధుకర్, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, 9వ వార్డు అధ్యక్షుడు మేరుగు కిరణ్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు స్వయం ఉపాధి బాట...

- కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ల పంపిణీ
- రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం... చిప్ప వెంకటేశ్వర్లు

**కొత్తవాడ/వరంగల్, సెప్టెంబర్ 7** : మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చేపడుతున్న కుట్టుశిక్షణ కార్యక్రమం అభినందనీయమని టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు అన్నారు. కొత్తవాడలో ఆయన ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సౌజన్యంతో నిర్వహిస్తున్న కుట్టుశిక్షణ కేంద్రంలో మూడో బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ అధ్యక్షుడు ఆర్‌టీఎన్ సోమ వేణుగోపాల్, ప్రాజెక్ట్ చైర్మన్ ఆర్‌టీఎన్ పీపీ బేతి అశోక్‌బాబు, చిప్ప వెంకటేశ్వర్లు, నేత రాఘవులు ముఖ్య అతిథులుగా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుట్టుశిక్షణ ద్వారా మహిళలు ఇంటి వద్దే స్వయం ఉపాధి పొందే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు ఆడెపు శిరీష, మాస్టర్ ట్రైనర్ శ్రీ కరుణ మాట్లాడుతూ ఇప్పటివరకు శిక్షణ కేంద్రం ద్వారా మూడు బ్యాచ్‌లకు చెందిన సుమారు 100 మంది మహిళలు కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సహకరించిన చిప్ప వెంకటేశ్వర్లు, కుట్టుమిషన్లు అందించిన రోటరీ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించడం ద్వారా మహిళా సాధికారతకు తోడ్పడటమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చిప్ప వెంకటేశ్వర్లు తెలిపారు.




# ప్రతి రైతు కుటుంబానికి స్థిరమైన ఆదాయం కల్పించేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి

### జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక.

**నారాయణపేట, సెప్టెంబర్,07**



గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రైతు కుటుంబానికి ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరేలా, స్థిరమైన ఆదాయ వనరులను కల్పించే విధంగా సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో డ్రాట్ మిటిగేషన్ ( కరువు నివారణ) పై జిల్లా కలెక్టర్ ప్రియాంక అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో డ్రాట్ మిటిగేషన్ కార్యక్రమంలో భాగంగా నారాయణ పేట జిల్లా లోని ఉట్కూర్ మండలాన్ని ఎంపిక చేయగా దానిని అమలు చేసే బాధ్యతను వాసన్ సంస్థ చేపట్టగా సోమవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వాసన్ సంస్థ ప్రతినిధులు డీ పీ ఆర్ ను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. గ్రామీణ కుటుంబాల అవసరాలు, స్థానిక వనరులు, రైతుల సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని ఒకే సమగ్ర ప్రణాళిక కింద వివిధ కార్యక్రమాలను అనుసంధానం చేయాలని సూచించారు.అందుబాటులో ఉన్న నిధులను చిన్నచిన్న కార్యక్రమాలుగా విభజించడం కంటే, ఎక్కువ మంది రైతు కుటుంబాలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే ఒక ప్రధాన ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని తెలిపారు. వ్యవసాయంతో పాటు పశుసంవర్ధక, పౌల్ట్రీ, డెయిరీ, గొర్రెలు, మేకల పెంపకం తదితర లైవ్‌స్టాక్ రంగాలను ప్రణాళికలో భాగం చేయాలని సూచించారు. ముఖ్యంగా పౌల్ట్రీ, లైవ్‌స్టాక్ రంగాల్లో ఉన్న అవకాశాలను గుర్తించి, రైతులకు అవసరమైన ఇన్‌పుట్స్, సాంకేతిక సహాయం, శిక్షణ, వెటర్నరీ సేవలు, మార్కెట్ లింకేజీ అందేలా సమగ్ర వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు.ఒక్కో చోట ఒక యూనిట్ ఏర్పాటు చేసి వదిలేయకుండా, ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు పూర్తి విలువ గొలుసు అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు. ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకులు, ఇన్‌పుట్స్, ఉత్పత్తి, సేకరణ, ప్రాసెసింగ్, నిల్వ, మార్కెటింగ్ వంటి అన్ని అంశాలను సమన్వయం చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీని కేవలం సహజ వనరుల నిర్వహణ (NRM) కార్యక్రమాలకు మాత్రమే పరిమితం చేయకుండా, ప్రతి కుటుంబం యొక్క ఆదాయం, ఆహార భద్రత, వ్యవసాయం, పశుసంపద, ఎంటర్‌ప్రైజెస్, ఉపాధి అవకాశాలను అనుసంధానం చేసే వేదికగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు.ప్రతి కుటుంబానికి వారి అవసరాలు, సామర్థ్యాలకు అనుగుణంగా తగిన ఎంటర్‌ప్రైజ్‌ను గుర్తించి, ఆర్థిక సంస్థలు, సంబంధిత శాఖలు, మార్కెట్ సంస్థల సహకారంతో అమలు చేసే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.ఇప్పటికే ఉన్న ఎఫ్ పీ వో లను బలోపేతం చేయాలని, ప్రతి ప్రాంతంలో కొత్త రైతు ఉత్పత్తిదారుల సంఘాలను (FPO) ఏర్పాటు చేయడం కంటే, ఇప్పటికే సమర్థవంతంగా పనిచేస్తున్న ఎఫ్ పీ వో లను గుర్తించి వాటిని మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ సూచించారు.అవసరం ఉన్న ప్రాంతాల్లో మాత్రమే కొత్త ఎఫ్ పీ వో లను ఏర్పాటు చేసి, వాటికి ప్రాసెసింగ్, నిల్వ, మార్కెటింగ్, వర్కింగ్ క్యాపిటల్, సాంకేతిక సహాయం వంటి అంశాల్లో అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ప్రతి ప్రణాళిక ఆర్థికంగా సాధ్యమైనది, దీర్ఘకాలికంగా నిలకడైనది, కుటుంబానికి ఆదాయం సమకూర్చే విధంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రణాళిక రూపొందించే సమయంలో పెట్టుబడి, ఆదాయ అవకాశాలు, మార్కెట్, నిర్వహణ వ్యయం, కుటుంబానికి కలిగే ప్రయోజనం వంటి అంశాలను సమగ్రంగా అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు."ఒక గ్రామం–ఒక సమగ్ర ప్రణాళిక–ప్రతి కుటుంబానికి ప్రయోజనం–స్థిరమైన ఆదాయం" అనే లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి, వాటిని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు.ప్రతి ప్రణాళిక ఆర్థికంగా సాధ్యమైనది, దీర్ఘకాలికంగా నిలకడైనది, కుటుంబాలకు స్థిరమైన ఆదాయం అందించే విధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక స్పష్టం చేశారు.

# మీరు హెల్దీగానే ఉన్నారా? ఇలా తెలుసుకోండి?





మనం అన్ని విధాలా ఆరోగ్యంగానే ఉన్నామా? లేదా? ఏదైనా సమస్య ఉందా? అన్న విషయం మనం కొన్ని అంశాల ఆధారంగా తెలుసుకోవచ్చు. మనకు తీవ్ర అనారోగ్యం కలిగినప్పుడు మాత్రమే కొన్ని రకాల పరీక్షలు చేయించుకుంటూ ఉంటాం. అప్పుడే మనకు ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా? అన్న విషయం తెలుస్తూ ఉంటుంది. అయితే మన శరీరంలో జరిగే కొన్ని మార్పుల ఆధారంగా మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం తెలుసుకోవచ్చు. అవేంటో ఈ కథనంలో తెలుసుకుందాం..

### జీర్ణవ్యవస్థ

మన ఆరోగ్యం విషయంలో జీర్ణ వ్యవస్థ ఎంతో కీలకం. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాలేదంటే మనకు ఏదో జీర్ణ సంబంధిత వ్యాధి ఉన్నట్టు పరిగణించాలి. తిన్న తర్వాత గ్యాస్ పట్టినట్టు అనిపిస్తుంటే కచ్చితంగా జీర్ణ వ్యవస్థలో ఏదో ఇబ్బంది ఉన్నట్టే గుర్తించాలి. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం అయితేనే మన శరీరానికి అన్ని రకాల పోషకాలు అందుతాయి.



### తగినంత నిద్ర

మనకు సరిగ్గా నిద్ర పట్టడం లేదంటే.. మనం డేంజర్ లో ఉన్నట్టే.. కాబట్టి కచ్చితంగా ప్రతి రోజు ఎనిమిది గంటల పాటు నిద్ర పోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతోపాటూ నిద్ర రాకపోయినా సమస్యగానే పరిగణించాలి. ఆరోగ్యంగా ఉన్నవారు మంచి నిద్రను పొందుతారు. రాత్రి నిద్ర తర్వాత రిఫ్రెష్, విశ్రాంతిని పొందుతారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. శరీరానికి మంచి నాణ్యమైన నిద్ర లభిస్తే.. అది మంచి శారీరక, మానసిక ఆరోగ్యానికి సంకేతంగా పరిగణించబడుతుంది.





### సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు

మూత్రవిసర్జన వలె, ప్రేగు కదలికలపై కూడా శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. సాధారణ, సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు మెరుగైన జీర్ణక్రియకు సంకేతంగా పరిగణించబడతాయి. రోజుకు ఒకటి లేదా రెండుసార్లు ప్రేగు కదలికలను కలిగి ఉండటం సాధారణమైనదిగా పరిగణించబడుతుంది. మలం విసర్జించడంలో ఎలాంటి ఇబ్బంది లేకపోయినా, మలవిసర్జన తర్వాత ఖాళీగా అనిపిస్తే అది మంచి ఆరోగ్యానికి సంకేతం.

### మూత్రం రంగు

మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం మన మల, మూత్రాల రంగును చూస్తే అర్థమవుతుంది. ఉన్నామో లేదో తెలుసుకోవడానికి.. మలం, మూత్రంపై శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. లేత పసుపు మూత్రం సాధారణంగా మీరు బాగా హైడ్రేట్ గా ఉన్నారని సూచిస్తుంది. ఇది కిడ్నీ రికవరీకి సంకేతంగా కూడా పరిగణించబడుతుంది. మూత్రం గట్టిపడటం లేదా రంగులో మార్పు కనిపిస్తే, జాగ్రత్తగా ఉండాలి.



### బరువును నియంత్రించడం:

అనేక రకాల వ్యాధులను నివారించడానికి బరువును అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం. మీ శరీర ఎత్తును బట్టి మీ బరువు సరిగ్గా ఉంటే అది మంచి ఆరోగ్యానికి సంకేతం. మీ బరువు తక్కువ సమయంలో వేగంగా పెరుగుతూ లేదా తగ్గుతూ ఉంటే, జాగ్రత్తగా ఉండాలి. బరువు అసమతుల్యత అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతుంది.





### మంచి మానసిక ఆరోగ్యం:

శారీరక ఆరోగ్యంలాగే, మానసిక ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. మీరు తక్కువ ఒత్తిడికి లోనవుతుంటే, మీ మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. చిరాకు, భయం వంటి సమస్యలు ఉండవు. అది మంచి మానసిక ఆరోగ్యానికి సంకేతం. శారీరక మరియు మానసిక ఆరోగ్యం ఒకదానికొకటి సంపూర్ణంగా ఉంటాయని ఇక్కడ గమనించడం ముఖ్యం. వీటిలో ఏదైనా ఒకదానిలో ఆటంకం మొత్తం శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.



### గాయాలను త్వరగా నయం చేయడం

శరీరంపై గాయం లేదా గాయం ఎంత త్వరగా నయం అవుతుందనే దాని ఆధారంగా కూడా ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు. గాయాలు త్వరగా మానితే మన రోగనిరోధక వ్యవస్థ బాగానే ఉందనడానికి సంకేతం. మధుమేహం వంటి వ్యాధులలో రోగనిరోధక శక్తి బలహీనపడటం వల్ల గాయాలు మానడానికి చాలా సమయం పడుతుంది. వీటితో పాటు మనం తరుచూ అనారోగ్యానికి గురవుతున్నామంటే కచ్చితంగా డాక్టర్ ను సంప్రదించి అన్ని పరీక్షలు చేయించుకోవాలి.

# ఉలవలతో ఇన్ని లాభాలా?



ఉలవచారు, ఉలవచారు బిర్యాని ఇప్పుడు ఎంతో ఫేమస్. అయితే ఉలవలతో అనేక ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయి. అందుకే వీటితో ఇప్పుడు రకరకాల వంటలు చేస్తున్నారు. భారత దేశంలోని  ఉష్ణమండల వాతావరణాల్లో ఈ ఉలవలు పెరుగుతాయి. వీటిలో అనేక రకాలైన పోషకాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు ఉలవలను తమ ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎర్రటి, గోధుమ రంగు పప్పుధాన్యాలు అవసరమైన పోషకాలతో నిండి ఉంటాయి. వీటిని శతాబ్దాలుగా సాంప్రదాయ వైద్యంలో వివిధ రకాల రోగాలకు చికిత్స చేయడానికి ఉపయోగించబడుతున్నాయి.

### ప్రోటీన్ పుష్కలంగా..

ఉలవల్లో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది. కండరాల పెరుగుదలకు, మరమ్మతుగా ప్రోటీన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. శాకాహారులకు ప్రోటీన్ అందజేసే ఆహారాల్లో ఉలవలు కూడా ఎంతో కీలకం. ఇక ఉలవల్లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇంకా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్ ను నిర్వహించడంలో ఫైబర్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. పోషకాలు అధికంగా ఉండే ఉలవల్లో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది బరువు నిర్వహణ, మొత్తం ఆరోగ్యానికి గొప్ప ఆహారంగా మారుతుంది. ఉలవల్లో యాంటీ డయాబెటిక్ లక్షణాలు ఉన్ఆనయి. అవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయని అధ్యయనాలు నిరూపించాయి.

### గుండె ఆరోగ్యం పదిలం

ఉలవలు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. దాని అధిక ఫైబర్ కంటెంట్, యాంటీఆక్సిడెంట్ లక్షణాల కారణంగా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉలువలలో ఉండే ఐరన్, మెగ్నీషియం, విటమిన్ సీ వంటి విటమిన్లు, ఖనిజాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి.





# కాకరతో ఇన్ని ప్రయోజనాలా? తెలిస్తే అస్సలు వదలరు..!

కాకరకాయ ఈ కూరగాయ పేరు చెప్పగానే చాలా మంది నిట్టూరుస్తారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే కాకరను తప్పదన్నట్టు తింటుంటారు. అయితే కాకరకాయతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆహారరంగ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా షుగర్ వ్యాధి గ్రస్తులకు కాకరకాయ ఓ సంజీవని లాంటిది. చక్కెర స్థాయిలను కాకర కంట్రోల్ చేస్తోంది. బరువు తగ్గడంలోనూ తోడ్పడుతుంది. జీర్ణ వ్యవస్థను కూడా మెరుగుపరుస్తుంది.

### కాకరరసంతో లాభాలు ఇవే..!

కాకరకాయ జ్యూస్ తరుచూ తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులకు దూరం కావొచ్చట. జీర్ణ వ్యవస్థను మెరుగుపరచడంలో కాకర కాయ రసం ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుత కాలంలో ప్రతి నలుగురిలో ఒకరు జీర్ణ సంబంధిత సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా కాకర కాయ రసాన్ని ఖాళీ కడుపుతో తాడగం వల్ల శరీరంలోని సమస్యలు తొలగిపోయి జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

### బరువు నియంత్రణ:

పెరిగిన బరువుతో చాలా మంది ఆందోళన చెందుతున్నాయి. అలాంటి వారు కాకర కాయ రసం తాగితే చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండే కాకర కాయ రసం బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా కాకర రసం తాగడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి ఎంతో సహాయపడుతుంది.

### ఇమ్యూనిటీ బూస్టర్.. !

ప్రస్తుత వర్షా కాలంలో జనం అనేక రోగాల బారిన పడుతున్నారు. సరైన ఇమ్యూనిటీ లేకపోవడం వల్లే వ్యాధుల బారిన పడుతున్నారు. అయితే కాకర రసం తరుచూ తీసుకోవడం.. లేదంటే కాకరకాయలను కూర చేసుకొని తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుందని వైద్య నిపుణలు సూచిస్తున్నారు. కాకరకాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తినిపెంచుతాయి.

### చర్మానికి మేలు:

కాకర కాయ రసం చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. కాకర కాయలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి . ఇవి చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించి కాంతివంతగా చేస్తాయి. కాకర కాయ రసాన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల చర్మానికి కొత్త మెరుపు వస్తుంది. అంతే కాకుండా దీని వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.



# క్యారెక్టర్ ఆర్టిస్ట్ జయప్రకాశ్ రెడ్డి

## నేడు జయప్రకాశ్ రెడ్డి వర్ధంతి

**జయప్రకాశ్ రెడ్డి తెలుగు నటుడు. రాయలసీమ యాసలో ఆయన చెప్పే సంభాషణలు ప్రసిద్ధి. ఈయన ఎక్కువగా ప్రతినాయక, హాస్య పాత్రలను పోషిస్తుండే వాడు.**

1946 మే 8 న కర్నూలు జిల్లా, ఆళ్ళగడ్డ మండలంలోని శిరువెళ్ళ గ్రామంలోని వ్యవసాయ కుటుంబంలో జన్మించాడు. తండ్రి సాంబిరెడ్డి సబ్ ఇన్స్పెక్టర్ గా పనిచేసే వాడు. నెల్లూరు లోని పత్తేకాన్ పేటలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు చదివాడు. తర్వాత నెల్లూరులోని రంగనాయకుల పేట లోని ఉన్నత పాఠశాలలో చేరాడు. పదో తరగతిలో ఉండగా తండ్రికి అనంతపురం బదిలీ అయ్యింది. అక్కడ సాయిబాబా నేషనల్ హయ్యర్ సెకండరీ స్కూల్లో ఎస్ఎస్ఎల్‌సీలో చేరాడు. చిన్నప్పటి నుంచే నాటకాలంటే ఆసక్తి ఉండేది. తండ్రి కూడా నటుడే అయినందున, ఇంట్లో కుటుంబ సభ్యులు కూడా అందుకు అడ్డు చెప్పేవారు కాదు. తండ్రీ కొడుకులు కలిసి కూడా నాటకాల్లో నటించారు. చదువులోనూ ముందుండే వాడు. డిగ్రీ తర్వాత ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకుని గణితం ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరాడు. అనంతపురం లోని పాఠశాలలో చదివేటపుడు అక్కడి టీచర్లందరూ ఆచార్యులే. గుండాచారి అని సైన్స్ టీచర్ కల్చరల్ యాక్టివిటీస్‌కి హెడ్‌గా పని చేసేవారు. కళలపై ఆయనకున్న అభిమానం ఇతనిపై చాలా పని చేసింది. ఒకరోజు ఆయన, స్నేహితుడు 'దుర్యోధన గర్వ భంగం' అనే నాటికలో పద్యాలు, డైలాగులు బట్టీ కొట్టేసి ఆయన దగ్గరకెళ్లి టపటపా అప్ప చెప్పాడు. ఎక్కడ తేడా వచ్చిందో తెలీదు. ఆయన చాలా కోపంగా 'మళ్లీ నాటకాల పేరెత్తితే తన్నేస్తాను వెధవల్లారా అంటూ అరిచాడు. ఆయన స్నేహితుడు లైట్‌గా తీసుకున్నాడు గానీ.. జయప్రకాష్ మాత్రం చాలా ఫీలయ్యాడు. మూడురోజులు బెంగ పెట్టు కున్నాడు. ఆ బాధ, కసి కారణంగానే నటనను వృత్తిగా స్వీకరించాలని ధృఢ నిర్ణయం తీసుకున్నాడు. ఒకసారి జయ ప్రకాష్ రెడ్డి నల్గొండలో గప్ చుప్ అనే నాటకాన్ని ప్రదర్శిస్తుండగా దాసరి నారాయణరావుకు ఆయన నటన నచ్చి, నిర్మాత రామా నాయుడుకు పరిచయం చేశాడు. అలా ఈయన 1988లో విడుదలైన "బ్రహ్మపుత్రుడు" చిత్రంతో తెలుగు సినీరంగానికి పరిచయ మయ్యాడు. అయితే 1997 లో విడుదలైన "ప్రేమించుకుందాం రా" చిత్రం ప్రతి నాయకునిగా మంచి పేరు తీసుకుని వచ్చింది. తరువాత బాలకృష్ణ కథా నాయకుడిగా వచ్చిన సమరసింహా రెడ్డి, నరసింహ నాయుడు లాంటి విజయవంతమైన సినిమాల్లో కూడా ఇలాంటి పాత్రతోనే ప్రేక్షకులను మెప్పించాడు.

**వరల్డ్ ఫేమస్ లవర్ (2020); సిల్లీ ఫెలోస్ (2018); అమర్ అక్బర్ ఆంటోని (2018)"; విజేత (2018); ఎమ్ఎల్ఏ (2018); నేనే రాజు నేనే మంత్రి (2017); రాధ (2017); హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామయ్య (2017); సుప్రీమ్ (2016); ఇంట్లో దెయ్యం నాకేం భయం (2016); మీలో ఎవరు కోటీశ్వరుడు (2016); పండగ చేస్కో (2015); జేమ్స్ బాండ్ (2015); సౌఖ్యం (2015); ప్రతినిధి (2014); గలాట (2014); జంప్ జిలాని (2014); ఎదురులేని అలెగ్జాండర్ (2014); షాడో (2013); అడ్డా (2013); నిప్పు (2012); దేవరాయ (2012); ప్రస్థానం (2010); బ్రహ్మాలోకం టు యమలోకం వయా భూలోకం (2010); ఆలస్యం అమృతం (2010); కిక్ (2009); కింగ్ (2008); రెడీ (2008); ఆట (2007); విక్రమార్కుడు (2006); ఛత్రపతి (2005); ఎవడిగోల వాడిదే (2005); ఎంజాయ్ (2004); కబడ్డీ కబడ్డీ; ఆయుధం (2003); చెన్న కేశవరెడ్డి (2002); లాహిరి లాహిరి లాహిరిలో (2002); నరసింహ నాయుడు; అల్లరి రాముడు (2002); ఆనందం; అడవి చుక్క (2000); ప్రేమించు కుందాం రా (1997); నీకోసం (1999); చిత్రం భళారే విచిత్రం (1992); బ్రహ్మ పుత్రుడు (1988) (తొలి చిత్రం) లలో విభిన్న పాత్రలు ఆయనకు పేరు తెచ్చి పెట్టాయి. గత ఏడాది సెప్టెంబర్ 8న జయప్రకాష్ రెడ్డి ఆకస్మిక మరణంతో తెలుగు సినిమా లోకం ఒక విలక్షణ నటుడిని కోల్పోయింది. ధర్మపురి క్షేత్రస్త శ్రీ లక్ష్మి నరసింహ నాట్య మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్లోని రవీంద్ర భారతిలో 2016 మార్చి 5న ప్రదర్శించిన వీర పాండ్య కట్ట బొమ్మన చారిత్రక నాటకాన్ని ఆసాంతం చూసిన జయప్రకాష్ రెడ్డి, నాటకం అయినాక స్టేజీ పైకి వెళ్ళి, తనూ ఈ నాటకంలో చాలా సార్లు ఎట్టప్ప విలన్ పాత్రలో నటించానని, ప్రేక్షకులకు వివరించి కట్ట బొమ్మన నాటకంలోని కళాకారులను ఒక్కొక్కరిని అభినందించిన నేపథ్యాన్ని కళాకారులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.**



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఆరోగ్య సంరక్షణలో ఫిజియోథెరపీ విప్లవం

### శరీర కదలికతో శాశ్వత ఆరోగ్యం.. ఫిజియోథెరపీ సందేశం

### నేడు ప్రపంచ శారీరక చికిత్స దినోత్సవం








ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 8న ప్రపంచ శారీరక చికిత్స దినోత్సవాన్ని జరుపు కుంటారు. ఈ దినోత్సవాన్ని 1996లో ప్రపంచ ఫిజియోథెరపీ సమాఖ్య అధికారికంగా ప్రకటించింది. నిజానికి ఈ సమాఖ్య 1951లోనే సెప్టెంబర్ 8వ తేదీన స్థాపించ బడింది. అందువల్ల ఈ తేదీకి విశేషమైన ప్రాధాన్యం కలిగింది. ఈ సందర్భంగా ఫిజియోథెరపీ యొక్క శాస్త్రీయ ప్రాముఖ్యతను, ప్రజల ఆరోగ్య రంగంలో దీని పాత్రను ప్రపంచానికి తెలియ జేయడం ప్రధాన ఉద్దేశం. ఫిజియోథెరపీ ఆధునిక వైద్య విధానంలో ఒక ముఖ్యమైన విభాగం. ఇది శరీర కదలికల ఆధారంగా వ్యాయామం, మాన్యువల్ థెరపీ, నాడీ ఉద్దీపన పద్ధతులు, పరికరాల వినియోగం వంటి శాస్త్రీయ మార్గాల ద్వారా వ్యాధులు, గాయాలు, దీర్ఘకాలిక నొప్పుల నుండి ఉపశమనం కలిగించే వైద్యశాస్త్రం. గాయం తర్వాత పునరుద్ధరణ మాత్రమే కాకుండా దీర్ఘకాలిక వ్యాధుల నివారణ, శస్త్రచికిత్సల అనంతర పునరావాసం, క్రీడాకారుల శారీరక పనితీరు మెరుగు పరచడం, వృద్ధాప్యంలో శక్తి నిలుపుదల, పక్షవాతం వచ్చినవారికి మళ్లీ నడక నేర్పించడం, ఊపిరి తిత్తులు మరియు గుండె సమస్యల పరిష్కారం వంటి విభిన్న కోణాలలో ఇది అపారమైన సేవ చేస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా సుమారు 1.7 బిలియన్ మంది కండరాలు, ఎముకలు, కీళ్ళ సమస్యలతో బాధ పడుతున్నారు. వీరిలో సగానికి పైగా ప్రజలు సరైన పునరావాస సేవలు పొందక పోవడం వల్ల శాశ్వత సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రతి సంవత్సరం మిలియన్లాది మంది రోడ్డు ప్రమాదాలు, స్ట్రోక్‌లు, మధుమేహం, వయోభారం వంటి కారణాలతో కదలిక సమస్యలకు గురవుతున్నారు. ఫిజియోథెరపీ వీరిలో చాలా మందికి మళ్లీ సాధారణ జీవన విధానం లోకి రావడానికి సహకరిస్తోంది. ఈ శాస్త్రం యొక్క అసలు బలమే కదలికను శాస్త్రీయంగా తిరిగి సాధించడం. అందుకే దీనికి "మూవ్మెంట్ ఈజ్ లైఫ్" అనే మంత్ర వాక్యం సరైన ప్రతిబింబంగా నిలుస్తుంది. భారత దేశంలో ఫిజియోథెరపీ రంగం గత రెండు దశాబ్దాల్లో విశేషంగా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం 500కుపైగా వైద్య కళాశాలలు, విశ్వ విద్యాలయాలు డీగ్రీ, పీజీ కోర్సులను అందిస్తున్నాయి. దేశంలో మూడున్నర లక్షలకు పైగా నమోదు చేసిన ఫిజియోథెరపిస్టులు సేవలందిస్తున్నారు. ప్రతి మెట్రో నగర ఆసుపత్రిలో ప్రత్యేక ఫిజియోథెరపీ విభాగం ఏర్పాటు చేయడం తప్పని సరిగా మారింది. క్రీడా రంగంలో ఐపీఎల్, హాకీ, ఒలింపిక్స్ వంటి క్రీడా జట్లకు ప్రత్యేక ఫిజియోథెరపీ బృందాలు పనిచేస్తున్నాయి. అలాగే వృద్ధాప్యంలో సంరక్షణ అవసరాలు పెరుగుతున్న తరుణంలో "హోమ్ ఫిజియోథెరపీ" సేవలు విస్తృతంగా వ్యాప్తి చెందుతున్నాయి. చిన్న పట్టణాలు, గ్రామాల్లో కూడా ఇప్పుడు ఈ సేవల అవసరాన్ని ప్రజలు గుర్తించ సాగారు. ప్రపంచ ఫిజియోథెరపీ సమాఖ్య ప్రతి సంవత్సరం ఒక ప్రధాన అంశాన్ని ప్రస్తావిస్తూ ఆ అంశంపై ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. 2025 సంవత్సరానికి ప్రధాన అంశంగా "జప్త్రతీశీఅఅఎ్రుఖఅఅ ఏ్రాప్త్రఎంఅశ్రేప్తవతీఘజూఎ" అనే విషయాన్ని ఎంచుకున్నారు. దీర్ఘకాలిక నొప్పులు ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అత్యంత సాధారణ ఆరోగ్య సమస్యలలో ఒకటిగా మారాయి. ప్రతి ఐదుగురిలో ఒకరు నడుము, మోకాళ్లు, మెడ నొప్పులతో బాధపడుతున్నారని తాజా అంచనాలు చెబుతున్నాయి. మందులతో కేవలం తాత్కాలిక ఉపశమనం పొందగలిగిన ఈ సమస్యలను శరీర భంగిమల మార్పులు, క్రమబద్ధమైన వ్యాయామం, పునరావాస పద్ధతులు, థెరప్యూటిక్ టెక్నిక్స్ ద్వారా శాశ్వతంగా నియంత్రించ గలమని నిపుణులు సూచిస్తున్నారు. ఈ రంగంలో ఫిజియోథెరపీ ప్రాముఖ్యత మరింతగా పెరుగుతోంది. సెప్టెంబర్ 8న ప్రపంచ వ్యాప్తంగా విద్యా సంస్థలు, ఆసుపత్రులు, ఫిజియోథెరపీ సంఘాలు ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య ర్యాలీలు, సదస్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తాయి. పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడతారు. స్ట్రోక్, మధుమేహం, వృద్ధాప్య సమస్యలు, క్రీడా గాయాల వంటి అంశాలపై ప్రజలకు సలహా కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ప్రజలకు వ్యాయామం, సరైన శరీర భంగిమ, క్రమశిక్షణ, కదలికల ప్రాముఖ్యత గురించి వివరిస్తారు. ప్రపంచ శారీరక చికిత్స దినోత్సవం కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు. ఇది ఆరోగ్య సంరక్షణలో ఫిజియోథెరపీ వృత్తి స్థానం, భవిష్యత్తు దిశను ప్రతిబింబించే ఒక విశ్వ వేదిక. శారీరక కదలికే జీవన శక్తి, దాన్ని శాస్త్రీయంగా వినియోగించి జీవన నాణ్యతను మెరుగు పరచే మార్గం ఫిజియోథెరపీ అని ఈ రోజు మనకు స్పష్టంగా గుర్తు చేస్తుంది. ఆధునిక సాంకేతికతల ప్రభావంతో కదలికలు తగ్గుతున్న తరుణంలో మనం వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలి. చిన్ననాటి నుంచే శారీరక చైతన్యాన్ని పెంపొందించు కోవాలి. వ్యాధులు రాకముందే నివారణ చర్యలు చేపట్టడం, వ్యాధుల అనంతరం సమర్థవంతమైన పునరావాసం సాధించడం వంటి లక్ష్యాలకు ఫిజియోథెరపీ మార్గదర్శి. అందువల్ల సెప్టెంబర్ 8 మనకు అందించే అసలు సందేశం ఒక్కటే– –కదలికే జీవం, క్రమశిక్షణే ఆరోగ్యం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఆర్థికాభివృద్ధి సాధనకు అక్షరాస్యత అనివార్యం

### నేడు అక్షరాస్యతా దినోత్సవం



సాంప్రదాయకంగా భాషను ఉపయో గించేందుకు అవసరమైన చదవటం, రాయటం, వినటం, మాట్లాడటం అనే నాలుగు ప్రాథమికాంశాలు తెలుసు కోవటాన్నే అక్షరాస్యత అనవచ్చు. అయితే.. రాయడం, చదవటం మాత్రమే అక్షరాస్యత కాదనీ.. గౌరవం, అవకాశాలు, అభివృద్ధి గురించి చెప్పడమే నిజమైన అక్షరాస్యత అని విజ్ఞుల అభిప్రాయం. ప్రపంచం అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు విద్య, విజ్ఞానం ఎంతో అవసరం. ఉన్నతమైన జీవనానికి ఇవి ఎంతో ముఖ్యం. యునెస్కో సెప్టెంబర్ 8 తేదీని అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవంగా ప్రకటించింది. దీని ముఖ్య ఉద్దేశం అక్షరాస్యతను వ్యక్తులు మరియు సంఘాలకు అందించడం. ఇది పిల్లల్లోనే కాకుండా వయోజన విద్య మీద కూడా కేంద్రీకరించ బడినది.

ప్రతి యేడాది సెప్టెంబర్ 8వ తేదీని "అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం"గా జరుపు కోవడం ఆనవాయితీ. 1965వ సంవత్సరం, నవంబర్ 17వ తేదీన యునెస్కో సభ్య దేశాల విద్యా శాఖా మంత్రుల మహాసభ అనంతరం.. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం ప్రకటించ బడింది. ఆ తరువాత 1966వ సంవత్సరం నుండి ప్రతి యేడాదీ క్రమం తప్పకుండా జరుపు కుంటున్నాం. ప్రపంచంలోని కొన్ని దేశాలు అన్ని రకాలుగా వెనుబడి ఉండటానికి నిరక్షరాస్యత ముఖ్య కారణమనేది కాదనలేని వాస్తవం. అదలా ఉంటే... ఐక్య రాజ్య సమితి విద్యా, విజ్ఞాన (శాస్త్రీయ) మరియు సాంస్కృతిక సంస్థ (యునెస్కో), ఐక్యరాజ్య సమితికి చెందిన ఒక ప్రధాన అంగము. ఇది1945లో స్థాపించ బడిన ప్రత్యేక సంస్థ. ఈ సంస్థ తన క్రియా శీల కార్య క్రమాలలో శాంతి, రక్షణలకు తోడ్పాటును అందించటమే గాక... అంతర్జాతీయ సహకారంతో విద్య, విజ్ఞానం, సాంస్కృతిక పరిరక్షణ కోసం పాటు పడుతుంది. 193మంది సభ్యులు, ఆరుగురు అసోసియేట్ సభ్యులు కలిగిన యునెస్కో ప్రధాన కేంద్రం ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఉంది. యునెస్కో తన తన కార్య క్రమాలను 5 రంగాలలో నిర్వహిస్తుంది, అవేంటంటే... విద్య, ప్రకృతి విజ్ఞానం, సామాజిక మరియు మానవ శాస్త్రాలు, సంస్కృతి, మరియు కమ్యూనికేషన్లు మరియు ఇన్ఫర్మేషన్. యునెస్కో, విద్య ద్వారా "అంతర్జాతీయ నాయకత్వం" కొరకు అవకాశాల కల్పనలో తన వంతు కృషి చేస్తుంది. దీని ప్రధాన ఉద్దేశ్యం... వివిధ దేశాలలో విద్యా విధానలను క్రమ బద్ధీకరించడం, ట్రైనింగ్ రీసెర్చ్‌లు చేపట్టడం.యునెస్కో ప్రజా ప్రకటనలిచ్చి, ప్రజలను చైతన్యవంతం చేస్తుంది. సాంస్కృతిక మరియు శాస్త్రీయ ఉద్దేశ్యాలు కలిగిన ప్రాజెక్టులను చేపడుతుంది. "భావ వ్యక్తీకరణ స్వాతంత్ర్యాన్ని, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ప్రోత్సహిస్తుంది. మీడియా ద్వారా, సాంస్కృతిక భిన్నత్వాలను తెలియ జేస్తున్నది. కాగా... యునెస్కో 1990 సంవత్సరాన్ని అక్షరాస్యతా సంవత్సరంగా ప్రకటించింది. ఇక ఐక్యరాజ్య సమితి అయితే 2003–2012ను అక్షరాస్యతా దశాబ్దంగా ప్రకటించింది. ఆ సంగతలా పక్కన బెడితే... ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలతో పోలిస్తే అక్షరాస్యత విషయంలో భారతదేశం ఆశించిన స్థానంలో లేదు. ఈ మాత్రమైనా మనదేశ అక్షరాస్యత ఉందంటే కొన్ని రాష్ట్రాలు అక్షరాస్యతను సాధించటంలో ముందుండటమే. మొత్తం మీద ప్రపంచ నిరక్షరాస్యుల్లో 35% మంది ఇంకా మనదేశం లోనే ఉండటం విచారకరం. స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించాలంటే దేశంలో 80 శాతం అక్షరాస్యత సాధించాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన 73 ఏళ్లు గడుస్తున్నా 75 శాతం అక్షరాస్యతనే సాధించ గలిగాము. అందరూ చదివి నప్పుడే గ్రామాభివృద్ధి జరుగుతుంది. భారత దేశంలో అక్షరాస్యత రేటులో విస్తృత స్థాయిలో లింగ పరమైన అసమానత ఉంది. వయోజనుల అక్షరాస్యత రేటు పురుషుల్లో 76.9 శాతం ఉండగా, మహిళల్లో ఇది 54.5 శాతం మాత్రమే ఉంది. తక్కువ మహిళా అక్షరాస్యత రేటు భారత దేశంలో కుటుంబ నియంత్రణ, జనాభా స్థిరీకరణ చర్యలపై నాటకీయంగా ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రపంచ వ్యాప్తంగా అక్షరాస్యత వృద్ధిలో చారిత్రక క్రమాల ఆధారంగా, ప్రస్తుతం అత్యధిక మంది నిరక్షరాస్యులు భారతదేశం లోనే ఉంటారని అంచనా. వయోజన అక్షరాస్యత 15 సంవత్సరాలు, అంత కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారిని సూచిస్తుంది. యువజన అక్షరాస్యత 15–24 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారిని సూచిస్తుంది. ఒకవైపు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆడపిల్లలు చదువులో దూసు కెళుతున్నారు. మరోపక్క పేద దేశాల్లో బాలికలు పాఠశాల మెట్లెక్కడమే అదృష్టంగా భావిస్తున్నారు. 1947లో భారతదేశ అక్షరాస్యత కేవలం 12 శాతం మాత్రమే. 2018లో దేశ అక్షరాస్యత 74 శాతానికి చేరడం విశేషం. అంటే 517 శాతం పెరిగింది. భారతదేశంలో అక్షరాస్యత సామాజిక – ఆర్థిక పురోగతికి కీలకంగా ఉంది. తాజా అధ్యయనం ప్రకారం భారత అక్షరాస్యత రేటు, ఆరు రెట్ల కంటే ఎక్కువ వృద్ధి సాధించినప్పటికీ, ప్రపంచ అక్షరాస్యత సగటుతో పోలిస్తే ఇప్పటికీ తక్కువగానే ఉంది. ప్రపంచంలో భారతదేశం ప్రస్తుతం అతి పెద్ద నిరక్షరాస్య జనాభా ఉన్న దేశంగా గుర్తించ బడుతోంది. అనేక ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేసినప్పటికీ భారతదేశ అక్షరాస్యత శాతం మంద కొడిగానే వృద్ధి చెందింది. ఇలాగైతే సంపూర్ణ అక్షరాస్యత స్థాయి సాధించడానికి భారతదేశానికి 2060 వరకు సమయం పడుతుందని సూచించింది. ఆసక్తికర అంశం ఏమిటంటే... ప్రపంచ జ్ఞాన వ్యవస్థలో భారతదేశం చాలా కీలక పాత్ర పోషించ బోతోంది. భారత్ ప్రపంచ గురువు కాబోతోంది. ప్రపంచంలోనే అతి పెద్ద సంస్కరణ 'నిష్టా' పేరిట 42 లక్షల మంది టీచర్లకు కేంద్ర ప్రభుత్వ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. విలువలు, ప్రమాణాలతో కూడిన విద్యను అందించే దిశగా అనేక చర్యలను కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ తీసుకుంది, మరిన్ని చర్యలను తీసుకో బోతోంది. నూతన విద్యా విధానంపై భారతీయులు అందరి అభిప్రాయాలు తెలుసు కోవాలనేదే మోడీ సర్కారు ఉద్దేశం. రాష్ట్రాల విద్యా మంత్రుల తోనూ, విద్యా శాఖ కార్యదర్శుల తోనూ, ముఖ్య మంత్రుల తోనూ నూతన విద్యా విధానంపై అభిప్రాయాలను గత ప్రభుత్వం

సేకరించడం జరిగింది. ఎన్‌జీవోలు, విద్యా రంగంలో గణనీయమైన ప్రగతి సాధించిన వారిని నేరుగా సంప్రదించి వారి అభిప్రాయాలను తెలుసుకుని, ఇక సామన్య ప్రజలు సైతం తమ అభిప్రాయలను తెలిపే వీలు కల్పించారు. ఇందుకు ప్రత్యేకించి ఒక పోర్టల్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ ఎటువంటి విద్యా విధానాన్ని కోరు కుంటున్నారనేది తెలియ జేయాలని కోరారు. ప్రతి సంస్కరణ, దేశ పురోభివృద్ధికి బాటలు వేయాలనేదే ఉద్దేశం. ఉన్నత విద్య సంస్కరణలు, భాషల అభివృద్ధి, పరిశోధనలకు పెద్ద పీట వేయాలని నూతన విద్యా విధానంలో తలపెట్టారు. ఇందుకు పెద్ద ఎత్తున నిధులు అవసరమవుతాయి. నిధుల సమీకరణ అనివార్యమే, అపుడే మనం ఆశించే సమగ్ర విద్యా విధాన విధాన అమలు కు మార్గం సుగమం అవుతుంది.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ

## దులీప్ ట్రోఫీ ఫైనల్లో అరుదైన చరిత్ర

దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించాడు. ఈస్ట్ జోన్ తరఫున కెప్టెన్‌గా బరిలోకి దిగిన అతడు అద్భుతమైన డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. సౌత్ జోన్‌తో జరుగుతున్న ఫైనల్లో సోమవారం రెండో రోజు ఆటలో 200 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఆదివారం ఆట ముగిసే సమయానికి ఇషాన్ 111 పరుగులతో అజేయంగా ఉన్నాడు. రెండో రోజు కూడా అదే జోరు కొనసాగించాడు. ఈ డబుల్ సెంచరీతో దులీప్ ట్రోఫీ ఫైనల్లో 200 పరుగులు చేసిన ఐదో బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు ఈ ఘనత సాధించిన వారిలో రమణ్ లాంబా, అన్షుమన్ గైక్వాడ్, ఛటేశ్వర్ పుజారా, యశస్వి జైస్వాల్ ఉన్నారు. 1987-88 సీజన్‌లో రమణ్ లాంబా 320 పరుగులతో అత్యధిక స్కోరు నమోదు చేశాడు. అదే సీజన్‌లో అన్షుమన్ గైక్వాడ్ 216 పరుగులు చేశాడు. 2016-17లో పుజారా 256 పరుగులతో అజేయంగా నిలిచాడు. 2022-23లో యశస్వి జైస్వాల్ 209 పరుగులు చేశాడు. మొదటి రోజు ఇషాన్, కుమార్ కుశాగ్ర కలిసి ఈస్ట్ జోన్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపారు. వీరిద్దరూ 26.4 ఓవర్లలో 144 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. రోజు ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ 385/4తో నిలిచింది. రెండో రోజు కుశాగ్ర కూడా సెంచరీ పూర్తి చేసి ఔటయ్యాడు. అయినా ఇషాన్ ఇన్నింగ్స్‌పై దాని ప్రభావం పడలేదు. ఈ డబుల్ సెంచరీతో ఇషాన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 4,000 పరుగుల మైలురాయిని కూడా దాటాడు. ఇదే ఫార్మాట్‌లో అతడికి ఇది 10వ సెంచరీ. సుదీర్ఘ ఫార్మాట్‌లో తన స్థానాన్ని తిరిగి సాధించేందుకు ఇషాన్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఇన్నింగ్స్ మరింత బలాన్నిచ్చింది. ఈస్ట్ జోన్ చివరిసారిగా 13 ఏళ్ల క్రితం దులీప్ ట్రోఫీని గెలిచింది. ప్రస్తుత ఫైనల్లో ఆ జట్టు ఆధిపత్యంలో ఉంది. బౌలర్లు రాణిస్తే రెండోసారి బ్యాటింగ్ చేయకుండానే టైటిల్ గెలిచే అవకాశం ఉంది.

# భారత్ టైటిల్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది





మహిళల ఆసియా కప్ 2026 టోర్నీలో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. లీగ్ దశలో మూడు మ్యాచ్‌లకు మూడు గెలిచిన భారత్.. గ్రూప్-ఏ టాపర్‌గా నిలిచింది. గ్రూప్-బీ రన్నరప్‌తో సెమీఫైనల్ మ్యాచ్ ఆడనుంది. గ్రూప్-బీ రన్నరప్‌గా బంగ్లాదేశ్ నిలిచే అవకాశం ఉంది. అయితే ఆ జట్టుకు యూఏఈతో గట్టి పోటీ నెలకొంది. ఈ రెండు జట్ల మధ్య మంగళవారం జరిగే మ్యాచ్ ఫలితంతో భారత్ సెమీస్ ప్రత్యర్థి ఎవరో తేలిపోనుంది. గత చరిత్ర చూసుకున్నా.. ఫామ్ పరిశీలించినా.. భారత్ టైటిల్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది. అయితే ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలిచినా.. ట్రోఫీ దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ఎందుకంటే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ.. ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) ఛైర్మన్ హోదాలో ఫైనల్ మ్యాచ్‌కు చీఫ్ గెస్ట్‌గా హాజరుకానున్నాడు. అతనే మహిళల ఆసియా కప్ 2026 విజేతకు ట్రోఫీ అందజేయనున్నాడు. ఈ విషయంపై అధికారిక సమాచారం లేకపోయినప్పటికీ.. చీఫ్ గెస్ట్ మోహ్సిన్ నఖ్వీనే అంటూ వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. గతేడాది పురుషుల ఆసియా కప్ 2025 ఫైనల్ మోహ్సిన్ నఖ్వీ కారణంగా రసాభాసగా మారిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన భారత్.. నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకునేందుకు నిరాకరించింది. మరోవైపు నఖ్వీ కూడా తనే ట్రోఫీని అందజేస్తానని పట్టుబట్టాడు. అంతేకాకుండా ట్రోఫీని తనవెంట తీసుకెళ్లిపోయాడు. దాంతో భారత ఆటగాళ్లు ట్రోఫీ లేకుండానే సంబరాలు చేసుకున్నారు. ఇప్పటికీ ఆ ట్రోఫీ ఏసీసీ కార్యాలయంలోనే ఉంది. బీసీసీఐ ఎన్నిసార్లు డిమాండ్ చేసినా మోహ్సిన్ మాత్రం వెనక్కి తగ్గలేదు. మహిళల ఆసియా కప్ ఫైనల్ అనంతరం కూడా ఇవే పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్ 13న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. భారత్ విజేతగా నిలిస్తే మాత్రం.. నఖ్వీ చేతుల మీదు టైటిల్ తీసుకోదు. అదే జరిగితే మరోసారి ట్రోఫీ లేకుండానే భారత్ విజేతగా స్వదేశానికి రావాల్సి ఉంటుంది. ఏం జరుగుతుందో చూడాలి. భారత్ చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్.. సెమీస్ బెర్త్ కోసం తండ్లాడుతోంది. నేడు (సోమవారం) హాంగ్‌కాంగ్‌తో జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో విజయం సాధిస్తేనే పాక్ సెమీస్ చేరనుంది. లేదంటే ఇంటిబాట పడుతోంది.

# సౌత్‌జోన్ కొంపముంచిన సిరాజ్

ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ ఆధిపత్యం చెలాయిస్తోంది. తిలక్ వర్మ సారథ్యంలోని సౌత్ జోన్‌తో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్(334 బంతుల్లో 30 ఫోర్లు, 7 సిక్స్‌లతో 270)తో డబుల్ సెంచరీతో సత్తా చాటగా.. కుమార్ కుశాగ్ర(132 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 101) సెంచరీతో చెలరేగాడు. శిఖర్ మోహన్(120 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 85), అభిమన్యు ఈశ్వరన్(86 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 72) హాఫ్ సెంచరీలతో రాణించారు. వైభవ్ సూర్యవంశీ(37 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 44) దూకుడుగా ఆడాడు. సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురణ విజయ్(4/180) నాలుగు వికెట్లు తీయగా.. చామ మిలింద్, శ్రేయస్ గోపాల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. షేక్ రషీద్‌కు ఒక వికెట్ దక్కింది. మిగతా బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. ముఖ్యంగా మహమ్మద్ సిరాజ్ తీవ్రంగా నిరాశపర్చాడు. 25 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక వికెట్ తీయకపోగా.. 5.60 ఎకానమీతో 140 పరుగులిచ్చుకున్నాడు. అతని వైఫల్యం ఈస్ట్ జోన్‌కు కలిసొచ్చింది. దూకుడుగా ఆడిన ఆ జట్టు రెండు రోజుల పాటు పూర్తిగా బ్యాటింగ్ చేసి రికార్డ్ స్కోర్ అందుకుంది. దులీప్‌ట్రోఫీ ఫైనల్స్ చరిత్రలోనే ఇది రెండో అత్యధిక స్కోర్‌గా నిలిచింది. 1987 దులీప్ ట్రోఫీ ఫైనల్లో వెస్ట్ జోన్‌పై నార్త్ జోన్ 868 పరుగులు చేసింది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక స్కోర్‌గా కొనసాగుతోంది. తాజా ఫైనల్‌కు ముందు రెండు సార్లు మాత్రమే జట్లు 700 ప్లస్ స్కోర్లు చేశాయి. 1986లో సౌత్ జోన్.. 1991లో నార్త్ జోన్ 700 పరుగుల మార్క్‌ను అందుకున్నాయి. హాఫ్ సెంచరీకి చేరువైన అనుకూల్ రాయ్(45)ను షేక్ రషీద్ ఔట్ చేయగా.. షమీ, ఖురైషి సౌత్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. శ్రేయాస్ గోపాల్ ఈ జోడీని విడదీసాడు. ఖరేషి(40)ని క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ దూకుడుగా ఆడి జట్టు స్కోర్ 700 ధాటించాడు. అతనితో పాటు ముఖేష్ కుమార్(0)ను విజయ్ పెవిలియన్ చేర్చి ఈస్ట్ జోన్ భారీ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. దాంతో రెండో రోజు ఆట ముగిసింది.



# రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు!

## పాకిస్థాన్ క్రికెట్ సంక్షోభం మరింత తీవ్ర రూపం

పాకిస్థాన్ క్రికెట్ సంక్షోభం మరింత తీవ్ర రూపం దాల్చింది. ఆ దేశ ఆటగాళ్లపై ఏకంగా ఫిక్సింగ్ ఆరోపణలు రావడం తీవ్ర దుమారం రేపుతోంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) అంతర్గత విచారణ కూడా చేపట్టినట్లు తెలుస్తోంది. మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ ఆఫ్ ఫీల్డ్ ప్రవర్తన అనుమానస్పదంగా ఉందనే వార్తలు కలకలం సృష్టించాయి. ఇంగ్లండ్ పర్యటనలో ఘోర పరాజయాలతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను కోల్పోయిన పాకిస్థాన్ జట్టు ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఈ ఘోర పరాజయాల నేపథ్యంలో పీసీబీ కూడా కఠిన చర్యలు తీసుకుంది. హెడ్ కోచ్, బౌలింగ్ కోచ్‌తో పాటు ఏడుగురు ఆటగాళ్లపై వేటు వేసింది. దాంతో పాకిస్థాన్ జట్టు అప్రతిష్టపాలై ఇంట బయట తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. అయితే ఇంగ్లండ్ గడ్డపై పాకిస్థాన్ ఘోర పరాజయాలకు క్రికెటర్ల వైఫల్యంతో పాటు... ఫిక్సింగ్ కూడా ఓ కారణమని మీడియాలో కథనాలు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ముఖ్యంగా వేటుకు గురైన ఏడుగురిలో రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ మొబైల్ డేటాను పీసీబీ స్వాధీనం చేసుకొని విచారణ జరుపుతుందని పాక్‌కు చెందిన జియో న్యూస్ పేర్కొంది. ఈ కథనం ప్రకారం.. పీసీబీ అధికారులు.. కేవలం ఆటగాళ్ల ప్రవర్తననే కాకుండా.. వారు సంప్రదించిన వ్యక్తులను కూడా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిక్సింగ్ ఆరోపణలకు సంబంధించిన వివరాలు ఇంకా బయటకు రావాల్సి ఉన్నప్పటికీ.. రిజ్వాన్, ఇమామ్ భవిష్యత్తుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంగ్లండ్ పర్యటనకు రిజ్వాన్, ఇమామ్‌లను ఎంపిక చేయడంపై వివరణ కోరుతూ సెలెక్టర్లకు పీసీబీ షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు మూడో టెస్ట్ ఆడే ఆటగాళ్ల నుంచి పీసీబీ మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు పాకిస్థాన్ వార్తా సంస్థ 365 న్యూస్ పేర్కొంది. మ్యాచ్ ముగిసే వరకు ఆటగాళ్లకు మొబైల్స్ ఇచ్చేది లేదని స్పష్టం చేసినట్లు రాసుకొచ్చింది. బర్మింగ్‌హామ్ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి మూడో టెస్ట్ ప్రారంభం కానుంది. ఫిక్సింగ్ ఆరోపణల నేపథ్యం పాక్ బోర్డు విచారణకు ఆదేశించింది. ఆటగాళ్లపై క్రమశిక్షణపరంగా.. అంతర్గత విచారణ జరుపుతున్నామని సోమవారం పీసీబీ మీడియా ప్రతినిధి అమీర్ మీర్ వెల్లడించాడు. 'ఇంగ్లండ్ పర్యటనలో పాక్ ఆటగాళ్ల క్రమశిక్షణ, ప్రవర్తన గురించి మీడియాలో కథనాలు రావడంతో విచారణకు ఆదేశించాం. ఈ విషయాలను అంతర్గతంగా సమీక్షిస్తాం. పీసీబీ ప్రమాణాలు, నియమనిబంధనల మేరకు విచారణ కొనసాగుతుంది. ఈ పరిస్థితుల్లో సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, కథనాలను విశ్వసించవద్దని కోరుతున్నాం. ప్రస్తుతానికైతే పీసీబీ ఈ వ్యవహారంపై ఎలాంటి కామెంట్ చేయడం లేదు. అభిమానులు, వాటాదారులు అందరూ పీసీబీ నుంచి అధికారికంగా వచ్చే సమాచారాన్ని మాత్రమే నమ్మాలి' అని అమిర్ మిర్ పేర్కొన్నాడు. కానీ ఆటగాళ్ల మొబైల్స్ లాక్కున్నారనే వార్తలపై అతను స్పందించలేదు.



# వరల్డ్ కప్‌లో భువీ కచ్చితంగా ఉండాల్సిందే..

## సెలక్టర్లకు మాజీ క్రికెటర్ విజ్ఞప్తి

భారత జట్టుకు విశేష సేవలందించిన సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్‌కు 2027 వన్డే ప్రపంచకప్‌లో అవకాశం కల్పించాలని భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా డిమాండ్ చేశారు. ఐపీఎల్ తో పాటు ఇటీవల ముగిసిన యూపీ టీ20 లీగ్‌లో భువీ అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ క్రమంలోనే సెలెక్టర్లు భువీ పేరును పరిశీలించాలని రైనా సూచించారు. అక్టోబర్-నవంబర్ 2027లో సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాల్లో వన్డే ప్రపంచకప్ జరగనుంది. ఆయా దేశాల్లో ఉండే వేగవంతమైన, స్వింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై భువనేశ్వర్ అనుభవం, బంతిపై అతనికున్న నియంత్రణ భారత జట్టు విజయాలకు ఎంతో కీలకంగా మారుతాయని రైనా అభిప్రాయపడ్డారు. యూపీ టీ20 లీగ్‌లో లక్నో ఫాల్కన్స్ జట్టు తరఫున ఆడిన భువనేశ్వర్ కుమార్ 11 మ్యాచుల్లో 14 వికెట్లు పడగొట్టారు. కేవలం వికెట్లే కాకుండా ఆయన వేసిన పొదుపైన బౌలింగ్ అందరినీ ఆకట్టుకుంది. మొత్తం 11 మ్యాచుల్లో ఆయన ఏకంగా 119 డాట్ బాల్స్



వేశారు. అంటే దాదాపు 20 ఓవర్ల పాటు ప్రత్యర్థి బ్యాటర్లకు ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా కట్టిపడేసారు. అంతేకాకుండా కేవలం 6.11 ఎకానమీ రేటుతో పరుగులు

బౌలింగ్‌లో స్వింగ్, వైవిధ్యంతో ప్రత్యర్థులను తిప్పలు పెట్టడంలో భువీ శైలి ప్రత్యేకం. భారత జట్టు రాబోయే రోజుల్లో యువత, అనుభవం కలయికతో ముందుకు వెళ్లాలని రైనా ఆకాంక్షించారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ భువనేశ్వర్ కుమార్, మహమ్మద్ షమీల అనుభవానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ జట్టులో ఉన్నట్లే, బౌలింగ్ విభాగంలో ఈ ఇద్దరు సీనియర్ పేసర్లు కూడా గిల్ ప్రణాళికల్లో భాగం కావాలని తెలిపారు. ముగ్గురు లేదా నలుగురు స్పెషలిస్ట్ పేసర్లను ఎంపిక చేసే క్రమంలో భువీ అనుభవాన్ని విస్మరించకూడదని వివరించారు. ఇక మీరట్ మెవ్రిక్స్ జట్టును విజేతగా నిలిపిన రింకూ సింగ్ కెప్టెన్సీ టాలెంట్ పై కూడా రైనా ప్రశంసల జల్లు కురిపించారు. ఒత్తిడి సమయంలో రింకూ ప్రదర్శించిన వ్యూహాత్మక చతురత అద్భుతమని కొనియాడారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) యాజమాన్యం రింకూ సింగ్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. దేశవాళీ టాలెంట్‌ను వెలికితీయడంలో యూపీ టీ20 లీగ్ ఎంతగానో

# ఇద్దరూ ఒకే సిగరెట్ తాగుతూ..

## మరోసారి అడ్డంగా దొరికిపోయిన జయం రవి-కెనీషా

చెన్నై, సెప్టెంబర్ 7 (చురకలు): కోలీవుడ్ ప్రముఖ నటుడు జయం రవి (రవి మోహన్), సింగర్ కెనీషాతో కలిసి ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతోంది. గత కొన్ని రోజులుగా భార్య ఆర్తితో విడాకుల వ్యవహారం కోర్టులో నడుస్తుండగా, కెనీషాతో రవి సన్నిహితంగా ఉంటున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో ఊపందుకుంది. ఈ క్రమంలో వారిద్దరూ కలిసి ఉన్న సరికొత్త వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సదరు వీడియోలో జయం రవి, కెనీషాతో పాటు మరికొందరు ఒక గ్రూప్ మీటింగ్‌లో పాల్గొన్నట్లు కనిపిస్తోంది. ఆ తీవ్ర చర్చల సమయంలో జయం రవి సిగరెట్ తాగి, దానిని కెనీషాకు అందించడం, ఆమె కూడా దానిని పీల్చడం స్పష్టంగా నమోదైంది. గతంలో తమ మధ్య ఎలాంటి సంబంధం లేదని, విడాకులు పూర్తయ్యే వరకు నటనకు విరామం ఇస్తున్నానని ప్రకటించిన రవి.. ఇటీవల తిరుమల దర్శనంలోనూ, ఇప్పుడు ఈ వీడియోలోనూ కెనీషాతో కలిసి కనిపిస్తుండటంపై అభిమానులు, నెటిజన్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆరంభంలో జయం రవికి మద్దతు తెలిపిన పలువురు నెటిజన్లు, ఈ ఘటనలతో తమ అభిప్రాయం మారిపోయిందని విమర్శలు గుప్పిస్తున్నారు.





# ‘రంభ ఊర్వశి మేనక’ కలెక్షన్స్ జోరు

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (చురకలు): ఈమధ్య సీరియస్ రోల్స్, ఇంటెన్స్ డ్రామాలు చేస్తూ వచ్చిన అల్లరి నరేష్.. మళ్లీ తన సొంత ట్రాక్ అయిన ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్ వైపు అడుగులేశారు. ఆడియన్స్ కూడా ఆయన నుంచి ఎక్కువగా ఆశించేది వింటేజ్ కామెడీ టైమింగే కావడంతో లేటెస్ట్ మూవీ ‘రంభ ఊర్వశి మేనక’పై రిలీజ్ ముందే క్రేజ్ ఏర్పడింది. ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో అవుట్ అండ్ అవుట్ కామెడీ ట్రాక్ లో ఈ సినిమా థియేటర్లలోకి వచ్చింది. మొదటి రోజు మార్నింగ్ షోస్ పడగానే కొన్ని చోట్ల మిక్స్‌డ్ టాక్ వినిపించినప్పటికీ, సినిమాలోని ఫన్ ఎలిమెంట్స్ కుర్రాళ్లతో పాటు ఫ్యామిలీస్ కి కనెక్ట్ అవ్వడం మొదలైంది. రొటీన్ కమర్షియల్ మాస్ సినిమాల మధ్య కాసేపు రిలాక్స్ అయి హాయిగా నవ్వుకునే స్పేస్ దొరకడంతో నెమ్మదిగా మౌత్ టాక్ బలపడింది. ముఖ్యంగా శనివారం, ఆదివారం నాటికి బీ, సీ సెంటర్లలో కూడా ఈవెనింగ్ షోలకు ఆక్యుపెన్సీలు మెరుగవుతూ వచ్చాయి. ఈ పాజిటివ్ వర్డ్ ఆఫ్ మౌత్ బాక్సాఫీస్ కలెక్షన్లలో కనిపిస్తోంది. మొదటి మూడు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 4.40 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి డీసెంట్ వీకెండ్ నంబర్లను నమోదు చేసింది. మిక్స్‌డ్ టాక్ ప్రభావం కొంత ఉన్నప్పటికీ ఈ స్థాయి వసూళ్లు రాబట్టడం మామూలు విషయం కాదు. అల్లరి నరేష్ టైమింగ్‌కి, కామెడీ జానర్‌కు ఇంకా ఆ క్రేజ్ తగ్గలేదని చెప్పవచ్చు. సినిమాలో స్వర్గలోకం నేపథ్యం, రంభ, ఊర్వశి, మేనకలుగా కనిపించిన నటీమణులతో నరేష్ చేసిన కామెడీ ట్రాక్స్ కూడా హైలెట్ అయ్యాయి. లాజిక్కులు వెతక్కుండా కేవలం ఎంటర్‌టైన్‌మెంట్‌ను మాత్రమే ఎంజాయ్ చేసే ఆడియన్స్‌కు ఈ కంటెంట్ బాగా రీచ్ అయింది. చైతన్ భరద్వాజ్ అందించిన మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఆ ఫన్ మూడ్‌ను నిలబెట్టడంలో సాయపడ్డాయి. కథ పరంగా కన్ఫ్యూజన్ ఏమి లేదు, రన్‌టైమ్ తక్కువగా ఉండటం, నరేష్ తన మార్క్ కామెడీతో నెట్టుకురావడం సినిమాకు కలిసొచ్చింది. దర్శకుడు చంద్రమోహన్ నరేష్ కు తగ్గ ఫన్ ను క్రియేట్ చేశాడు, హాస్య మూవీస్ నిర్మాణ విలువలు సినిమా స్కేల్‌కు సరిపోయేలా ఉన్నాయి. పెద్దగా హంగులకు పోకుండా కేవలం ఫన్ ట్రాక్స్‌పైనే ఫోకస్ పెట్టడంతో బాక్సాఫీస్ వద్ద వీకెండ్ వరకు ఒక మోస్తరుగా నిలబడగలిగింది. అయితే చిత్రానికి అసలైన ఛాలెంజ్ సోమవారం నుంచే మొదలవుతోంది. వీకెండ్‌లో వచ్చిన డీసెంట్ నంబర్స్ మిక్స్‌డ్ టాక్ ఉన్న సినిమాలకు వర్కింగ్ డేస్‌లో కంటిన్యూ అవ్వడం అంత సులువు కాదు. ఇక రాబోయే రోజుల్లో ఈ సినిమా ఎలాంటి కలెక్షన్స్ అందుకుంటుందో చూడాలి.



# ఇండస్ట్రీకి గుడ్ బై చెప్పేస్తుందా?

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (చురకలు): లేడీ సూపర్ స్టార్ గా తనకంటూ చెరగని ముద్ర వేసుకున్న కథానాయిక అనుష్క శెట్టి. అరుంధతి, భాగమతి, బాహుబలి వంటి భారీ చిత్రాలతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న స్వీటీ గత కొంతకాలంగా వెండితెరకు.. మీడియా ప్రమోషన్లకు దూరంగా ఉండటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అమ్మడు నటించిన చిత్రాలు విడుదలవుతున్నా? ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం అనుష్క నటనా జీవితానికి ముగింపు పలకాలనే ఆలోచనలో ఉన్నట్లు పరిశ్రమలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అనుష్క మలయాళంలో తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ జానపద చిత్రం -కథనార్: ది విల్డ్ సోర్సరర్- లో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రం ఫలితంపైనే అనుష్క భవిష్యత్తు ప్రణాళికలు ఆధారపడి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో క్రమం తప్పకుండా వరుస సినిమాలు చేసిన అనుష్క ఇటీవల కాలంలో కథల ఎంపికలో అత్యంత జాగ్రత్త వహిస్తున్నారు. మనసుకు నచ్చిన, ప్రాధాన్యత ఉన్న పాత్రలకు మాత్రమే ఓకే చెబుతున్నారు. అయితే సినిమాల ఎంపిక తగ్గించడంతో పాటుగా ఆయా చిత్రాల ప్రచార వేదికలపై ఆమె కనిపించకపోవడం అభిమానులను కలవరపెడుతోంది. పర్సనల్ లైఫ్, ఫిట్‌నెస్ లైఫ్‌స్టైల్‌పై దృష్టి పెట్టడం వల్లే ఆమె గ్లామర్ ప్రపంచానికి కాస్త విరామం ఇచ్చారని కొందరు విశ్లేషిస్తున్నారు. -కథనార్- చిత్రం పాన్-ఇండియా స్థాయిలో అత్యంత అట్టహాసంగా విడుదల కానుంది. ఈ సినిమా కనుక బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధిస్తే అనుష్క కెరీర్‌ను మరికొంత కాలం కొనసాగించే అవకాశం ఉందంటున్నారు. ఒకవేళ ప్రాజెక్ట్ ఫలితం తారుమారైతే స్వీటీ పూర్తిస్థాయిలో చిత్ర పరిశ్రమకు గుడ్ బై చెప్పి, వ్యక్తిగత జీవితానికే ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం మొదలైంది. అనుష్క శెట్టి గ్లామర్ పాత్రలకే పరిమితం కాలేదు. లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద హీరోలకు సమానంగా వసూళ్లు రాబట్టిన నటి. టాలీవుడ్, కోలీవుడ్‌లలో తిరుగులేని ఇమేజ్‌ను సంపాదించుకున్న అమ్మడు పరిశ్రమను వీడుతున్నారనే వార్తలు అభిమానులను నిరాశకు గురి చేస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా స్వీటీ తిరిగి పూర్తిస్థాయిలో సినిమాలు చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఏది ఏమైనా? -కథనార్- చిత్రం విడుదలయ్యే వరకు ఈ ప్రచారాలపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. అనుష్క నిర్ణయం ఏదైనా? అమ్మడు మళ్లీ పూర్వ వైభవంతో వెండితెరపై మెరవాలని.. మరిన్ని పవర్‌ఫుల్ పాత్రలతో ప్రేక్షకులను అలరించాలని అభిమానులు మాత్రం బలంగా కోరుకుంటున్నారు.

# ‘ది ప్యారడైజ్’ విడుదల వాయిదా?




హైదరాబాద్, సెప్టెంబర్ 7 (చురకలు): నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ డ్రామా ‘ది ప్యారడైజ్’ విడుదల తేదీపై మళ్లీ నీలినీడలు కమ్ముకున్నాయి. ముందుగా ప్రకటించిన ప్రకారం సెప్టెంబర్ 24న ఈ చిత్రాన్ని విడుదల చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడే అవకాశం ఉందని టాలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా సినిమాను అక్టోబర్ 1వ తేదీకి మార్చాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, ‘ది ప్యారడైజ్’ క్లైమాక్స్‌లో భారీ స్థాయిలో వీఎఫ్‌ఎక్స్, సీజీ వర్క్ ఉంది. ఈ గ్రాఫిక్స్ పనులు అనుకున్న సమయానికి పూర్తి కావడం లేదని, అందుకే విడుదల తేదీని వాయిదా వేయాలనే ఆలోచనలో ఉన్నారని అంటున్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఒక్క క్లైమాక్స్ సీజీ వర్క్ కోసమే సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేస్తున్నారని, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ జాప్యం జరుగుతోందని సమాచారం. ఒకవేళ ఈ సినిమా అక్టోబర్ 1కి వాయిదా పడితే, బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొననుంది. నాగవంశీ నిర్మించిన ‘ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47’ అక్టోబర్ 2న విడుదల కానుంది. విశేషమేమిటంటే, ‘ది ప్యారడైజ్’ నైజాం హక్కుల్లో నాగ వంశీకి 25 శాతం వాటా ఉంది. గతంలో ‘ది ప్యారడైజ్’ కోసం ఆయన తన సినిమాను వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు ఈ రెండు చిత్రాలు దాదాపు ఒకేసారి విడుదలయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. అక్టోబర్ రెండో వారంలో విజయ్ దేవరకొండ ‘రణబాలి’, సూపర్ స్టార్ రజనీకాంత్ ‘జైలర్ 2’ వంటి పెద్ద సినిమాలు కూడా రానుండటంతో పోటీ మరింత తీవ్రంగా ఉండనుంది. ఇప్పటికే ‘ప్యారడైజ్’ సినిమా రెండుసార్లు వాయిదా పడింది. తొలుత మార్చి 26, ఆ తర్వాత ఆగస్టు 21 తేదీలను ప్రకటించి, చివరకు సెప్టెంబర్ 24ను ఖరారు చేశారు. ఇప్పుడు మరోసారి వాయిదా పడితే ఇది మూడోసారి అవుతుంది. ఇది డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848899998, editor@churakalu.com